
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

బుధవారం 20 నవంబరు 2024



విజ్ఞానాలయాలుగా విలసిల్లుతున్న గ్రంథాలయాలు.. నిధులు రాక, నిర్వహణ లేక విలవిలలాడుతున్నాయి. వివిధ రకాల గ్రంథాలు, పోటీ పరీక్షల పుస్తకాలు లేక, పాఠకుల ఆదరణ కోల్పోయి వెలవెలపోతున్నాయి. వందలాది మంది పాఠకులతో కళకళలాడే గ్రంథాలయాలు నేడు కునారిల్లిపోతున్నాయి. నిధుల కొరతతో.. మారుతున్న కాలానికి అనుగుణంగా నవీకరణకు నోచుకోలేక గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉన్న లైబ్రరీలు గత వైభవం కోసం ఎదురుచూస్తున్నాయి. ఉద్యోగార్థులకు కావాల్సిన పుస్తకాలను అందించడంతో పాటు జ్ఞాన సముపార్జనకు వచ్చే పలువురికి అరకొర సౌకర్యాలే స్వాగతం పలుకుతుండడంతో గ్రంథాలయాలకు వచ్చేవారి సంఖ్య రోజురోజుకు తగ్గుముఖం పడుతోంది. గడచిన ఐదేళ్లలో ఒక్క పుస్తకం కొనుగోలుకు కానీ, భవనాల మరమ్మతులకు కానీ ఒక్క రూపాయి వెచ్చించలేదంటే గ్రంథాలయాలపై ప్రభుత్వ నిర్లక్ష్యం ఏరీతిన ఉందో తెలుసుకోవచ్చు. స్థానిక సంస్థల నుంచి హక్కుగా రావాల్సిన సెస్సు కూడా ఏళ్ల తరబడి జమ కాకపోవడంతో కోట్ల రూపాయలు బకాయిలు వెక్కిరిస్తున్నాయి. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పాఠకుల కోసం గ్రంథాలయాల సమస్యలపై ప్రత్యేక కథనం.

విజ్ఞానాలయాలు.. వెలవెల



గుంటూరులోని ఏసీ కళాశాల ఎదుట ఉన్న స్టేట్ లైబ్రరీలోని దెబ్బతిన్న సీలింగ్, గోడలు


ఆంధ్రజ్యోతి ఫోకస్

ఆధునికతకు.. ఆపసోపాలు

అవే పత్రికలు, పుస్తకాలు తప్ప డిజిటలైజేషన్ వైపు పకడ్బందీగా అడుగులు వేయలేక గ్రంథాలయాలు ఆపసోపాలు పడుతున్నాయి. ఇంటర్నెట్ వినియోగం పెరిగిపోతున్న తరుణంలో గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేయాలని నిర్ణయించారు. అయితే ఇందుకోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం లేదు. గ్రేడ్-1, 12 గ్రేడ్-2 శాఖా గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేయాలని గతంలో అధికారులు సంకల్పించగా ఆ ప్రయత్నం ముందుకు సాగడంలేదు. గుంటూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 20 కంప్యూటర్లతో ఎయిర్ కండీషనింగ్ చేయించినా పాఠకులకు ఉచిత సేవలు అరకొరగానే లభిస్తున్నాయి.

ఆదర్శంగా వినుకొండ

2007వ సంవత్సరం నుంచి మొదలుకొని పల్నాడు జిల్లా పరిధిలోని వినుకొండ మున్సిపాలిటీ క్రమం తప్పకుండా సెస్సు చెల్లిస్తున్నది. రూ.1.63 కోట్ల గ్రంథాలయ సెస్సుకు మొత్తం డిమాండ్ చెల్లించింది. వినుకొండ మున్సిపాలిటీని ఆదర్శంగా తీసుకుని సెస్సు బకాయిలు లేకుండా అన్ని పురపాలక సంఘాలు, పంచాయతీలు, ఏపీఐఐసీ చెల్లిస్తే పాఠకులకు అధునాతన సౌకర్యాలను గ్రంథాలయాల్లో కల్పించొచ్చు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లుగా బకాయిలు చెల్లించకపోవడంతో గ్రంథాలయాలు కునారిల్లిపోయాయి.



(ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్)

పలు దినపత్రికలు, గ్రంథాలు, పోటీ పరీక్షల పుస్తకాలు.. వాటిని చదువుకునేందుకు వచ్చే పాఠకులతో గ్రంథాలయాలు కళకళలాడుతుండేవి. గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా స్థాయిలో గ్రంథాలయాలకు పెద్ద ఆదరణ ఉండేది. ప్రభుత్వంతో పాటు గ్రంథకర్తలు, సాహితా సంస్థల ప్రోత్సాహంతో గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలుగా విలసిల్లేవి. ఎందరికో ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగాలు రావడానికి కారణమయ్యాయి. అలానే సాహితీవేత్తలను తయారు చేశాయి. అలాంటి గ్రంథాలయాలు గత కొంతకాలంగా నిధులు లేక, పలు రకాల సమస్యలను పరిష్కరించే దిక్కు లేక, ఎవరికీ పట్టనట్లుగా ఉంటున్నాయి. ప్రభుత్వాలు గ్రంథాయాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయి. ప్రభుత్వం గ్రంథాలయాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోగా ప్రజల నుంచి వసూలు చేస్తున్న సెస్సులను స్థానిక సంస్థలు దారి మళ్లిస్తున్నా పట్టించుకోవడంలేదు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ గ్రంథాలయాలకు జమ చేయకుండా జాప్యం చేస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం సీఎఫ్ఎంఎస్ విధానం కారణంగా కనీసం స్టేషనరీ సామాగ్రిని కూడా కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 97 శాఖా గ్రంథాయాలు, 32 గ్రామీణ, 103 పుస్తక పంపిణీ కేంద్రాలున్నాయి. ఆయా గ్రంథాలయాల్లో 10,52,370 పుస్తకాలు అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. గుంటూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 51,862 పుస్తకాలు ఉండగా వాటిలో చాలావరకు కాలం చెల్లినవే. అప్‌డేట్ అయినవి చాలా తక్కువగా ఉన్నాయి. వివిధ రకాల పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అవసరం మేరకు అందుబాటులో లేవు. రీడర్స్ ఆన్ డిమాండ్ పుస్తకాలను తెప్పించడంలో జాప్యం జరుగుతున్నది. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్కటంటే ఒక్క పుస్తకం కొత్తగా కొని పాఠకులకు అందుబాటులో ఉంచలేదు. డీఎస్సీ, టెట్, గ్రూప్స్ పరీక్షలకు సన్నద్ధమయ్యే ఉద్యోగార్థులకు కావాల్సిన ఏ ఒక్క మెటీరియల్ కూడా గ్రంథాలయాల్లో అందుబాటులో లేదు. గ్రంథాలయాల్లో భర్తీ కావాల్సిన పోస్టులు అయితే పదుల సంఖ్యలోనే ఉన్నాయి. చాలా చోట్ల అవుట్ సోర్సింగ్ విధానంతోనే నడిపిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో అయినా గ్రంథాలయాలను గాడిన పెట్టే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు బకాయిల వసూలుపై దృష్టి పెట్టి ఆ నిధులను వాటి అభివృద్ధిపై ఖర్చు పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతుండడంతో ఆర్భాటపు ప్రకటనలకే పరిమితం కాకుండా అమలు జరిగే పనులకు పూచీ ఇచ్చి వాటిని ఆచరణలోకి తేవాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

భయం..భయం





గుంటూరు, తెనాలిలో గ్రంథాలయాల దుస్థితి



- ఆదరణ లేక గ్రంథాలయాలు వెలవెల
- ఐదేళ్ల వైసీపీ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యం
- అరకొర పుస్తకాలతోనే పరిమితంగా సేవలు
- లైబ్రరీలకు సెస్సులు చెల్లించని స్థానిక సంస్థలు
- కూటమి ప్రభుత్వంలో పూర్వ వైభవం రావాలని ఆశ

సెస్సుల జమలో నిర్లక్ష్యం

ప్రజలు చెల్లించే ఆస్తి పన్నులో 8 శాతం సెస్సు కింద ఎక్కడికక్కడ ఉండే గ్రంథాలయాల ఖాతాల్లో జమ చేయాలి. ఈ నిధుల్ని గ్రంథాలయాల అభివృద్ధికి మాత్రమే వెచ్చించాలని నిబంధనలున్నాయి. గడచిన ఐదేళ్లలో సెస్సు మొత్తాలను లైబ్రరీ ఖాతాలకు జమ చేయకపోగా ఆ నిధులను దారి మళ్లించేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పురపాలకసంఘాలు, పంచాయతీలు, కార్పొరేషన్‌లు, ఏపీఐఐసీ నుంచి గ్రంథాలయాలకు సెస్సు బకాయిలు రావాలి. 2007-08 నుంచి రూ.42 కోట్ల పైచిలుకు సెస్సు బకాయిలు పేరుకుపోయి ఉన్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కార్పొరేషన్ల నుంచి రూ.8.08 కోట్లు, మున్సిపాలిటీల నుంచి రూ.3.97 కోట్లు, పంచాయతీల ద్వారా రూ.3.16 కోట్లు, ఏపీఐఐసీ నుంచి రూ.75,90,733 కలిపి మొత్తంగా రూ.15 కోట్ల 99 కోట్ల సెస్సు రావాలి. అయితే ఇప్పటివరకు రూ.9.02 కోట్లు మాత్రమే వసూలైంది. ఇంకా రూ.6.96 కోట్లు వసూలు కావాల్సి ఉన్నది. బాపట్ల పురపాలక సంఘం నుంచి రూ.30.44 లక్షల బకాయి రావాల్సి ఉండగా ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. చిలకలూరిపేట నుంచి రూ.37.63 లక్షలు, మాచర్ల నుంచి రూ.19.11 లక్షలు, పిడుగురాళ్ల నుంచి రూ.29.18 లక్షలు, గురజాల నుంచి రూ.4.43 లక్షలు, దాచేపల్లి నుంచి రూ.8.48 లక్షల్లో రూపాయి కూడా వసూలు జరగలేదు. 1017 పంచాయతీల్లో రూ.3.16 కోట్లు డిమాండ్ ఉంటే అందులో సగం మాత్రమే జమైంది. ఏపీఐఐసీ నుంచి రూ.75.90 లక్షలు రావాల్సి ఉండగా ఒక్క రూపాయి విడుదల కాలేదు. ఇలా సెస్సు బకాయిలు పేరుకుపోతుండటంతో గ్రంథాలయాల నిర్వహణపై భారం పడుతున్నది.

ఇరుకు గదే దిక్కు



పొన్నూరుటౌన్: పాతపొన్నూరులో ఏర్పాటు చేసిన గ్రంథాలయం చిన్న గదిలో ఉంది. దీంతో పాఠకులు ఆరు బయట కూర్చొని పుస్తక పఠనం చేసుకోవాల్సి వస్తోంది. పట్టణంలోని సాక్షి భవనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తొలగించారు. అమూల్యమైన గ్రంథాలను గుంటూరు తరలించారు. దీంతో పొన్నూరు వాసులకు పట్టణంలో ప్రధాన గ్రంథాలయం లేకుండా పోయింది. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారు గుంటూరు వంటి ప్రాంతాలకు తరలివెళ్లాల్సిన పరిస్థితులు నెలకున్నాయి. నిడుబ్రోలు, పాతపొన్నూరు గ్రంథాలయ భవనాలు శిథిలమై ఉన్నాయి.

ఆరుబయటే.. పఠనం

మంగళగిరి సిటీ: మంగళగిరి శాఖా గ్రంథాలయానికి శివాలయం పక్కన సువిశాలమైన ప్రాంగణం ఉన్నా భవనం శిథిలావస్థకు చేరడంతో ఏడెనిమిదేళ్ల కిందట ఆధునికీకరణ పనులను ప్రారంభించినా ఇప్పటికీ పనులు పూర్తి కాలేదు. గ్రేడ్-1 గ్రంథాలయమైనా దానికి తగ్గట్టుగా సిబ్బందిని నియమించలేదు. స్థలాభావం కారణంగా పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వివిధ రకాల పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు ఆరుబయటే పుస్తక పఠనం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.





తెనాలి అర్బన్: తెనాలి గ్రేడ్-1 గ్రంథాలయానికి సెస్ బకాయిలు రూ.2 కోట్లకు పైగా ఉంది. 1992లో నిర్మించిన భవనం పై అంతస్తు శ్లాబు పెచ్చులూడుతోంది. పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉండటంతో ఆదరణ పొందుతుంది. దాతల సాయం కూడా అందుతోంది. సెస్ బకాయిలు గ్రంథాలయ సంస్థకు చేరితే మరమ్మతులకు అవకాశం లభిస్తుంది. గ్రంథాలయం వెంబడి ప్రహరీకి అనుకుని రోడ్డుపక్కన మున్సిపాలిటీ మూత్రశాల నిర్మించింది. దానిని సక్రమంగా శుభ్రం చేయకపోవడం, గోడ వెంబడి కాల్వలో పాదచారులు మూత్రవిసర్జనతో పాఠకులు దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నారు.

తెనాలిలో దుర్గంధం

ఉదయం పాస్.. సాయంత్రం ఫెయిల్

- 'తేమ' పరీక్షలో చిత్తవుతున్న పత్తి రైతు
- అమ్మకాల కోసం రోజుల తరబడి నిరీక్షణ
- తిరస్కరించిన లోడ్‌ను తిరిగి తీసుకెళ్లడం అదనపు భారం





పత్తిలో తేమ శాతం చూస్తున్న అధికారులు

గుంటూరు సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులు.. సీసీఐ నిబంధనలు.. పత్తిని అమ్ముకునే రైతులకు అగ్నిపరీక్షలుగా మారుతున్నాయి. మద్దతు ధర దక్కుతుందనుకున్న సీసీఐ కేంద్రాల్లో చిత్ర, విచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. ఎండ వేడి ఎక్కువగా ఉన్న ఉదయం వేళ తీసుకువస్తున్న పత్తి లాట్‌లు సీసీఐ తేమ పరీక్షలో నెగ్గుతున్నాయి. సాయంత్రం తీసుకువస్తున్న పత్తి లాట్లలో తేమ శాతం నిబంధనలకు మించి ఉండటంతో తిరస్కరిస్తున్నారు. కొన్ని కేంద్రాల్లో పత్తి కొనుగోలు కోసం రైతులు ఒకటి, రెండు రోజులు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంటోంది. అప్పటికీ కూడా తేమ శాతం ఎక్కువగా ఉందన్న కారణంతో కొనుగోలు చేయకపోతుండటంతో ఉసూరుమంటూ వెళ్లిపోతున్నారు.

యంత్రాల్లో తేడా...

ప్రస్తుతం సీసీఐ కేంద్రాల్లో తేమ శాతం చూసేందుకు బయ్యర్లు రెండు రకాల యంత్రాలు వినియోగిస్తున్నారు. వాటిలో ఒక్కో దానిలో ఒక్కో తేమ శాతం కనిపిస్తుంది. చిన్న ముళ్ళు ఉన్న యంత్రంలో 12 శాతం తేమ ఉన్నట్లు చూపిస్తుంటే, పెద్ద ముళ్ళు ఉన్న యంత్రంలో 15 శాతం ఉన్నట్లు

(మిగతా 6లో)

సంక్షేమ పథకాల సత్వర అమలుకు ప్రణాళికలు సిద్ధం

● ఏపీ మాదిగ సంక్షేమ కో ఆపరేటివ్ ఫైనాన్స్ సంస్థ చైర్ పర్సన్ శ్రీదేవి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న శ్రీదేవి


గుంటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో షెడ్యూల్ కులాల సంక్షేమ పథకాలకు కేటాయించిన నిధుల్లో సంక్షేమ పథకాలు సత్వర అమలు కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆంధ్రప్రదేశ్ మాదిగ సంక్షేమ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థ చైర్‌పర్సన్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి తెలిపారు. తాడేపల్లిలోని కార్యాలయంలో మంగళవారం సంస్థ సిబ్బందితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. శ్రీదేవి మాట్లాడుతూ సిబ్బంది అంకిత భావంతో పని చేసి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సంక్షేమ పథకాల అమల్లో నిర్లక్ష్యం చేస్తేచర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ కే కృష్ణవేణి, కార్యనిర్వహణ అధికారులు మంగారావు, కామేశ్వరరావు, ప్రసాద్ ఉన్నారు.

వైసీపీలో ఇంకా మార్పు రాలేదు: కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వైసీపీని 11 సీట్లుకే పరిమితం చేసినప్పటికీ వారి వైఖరిలో ఎటువంటి మార్పు రాలేదని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మంగళ వారం ఒక ప్రకటనలో విమ ర్శించారు. వృద్ధిరేటులో కూటమి ప్రభుత్వం కంటే జగన్ ప్రభుత్వంలోనే ఎక్కువగా ఉందన్న అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో వృద్ధి రేటు పెరగాలంటే కొత్తగా పరిశ్రమలు తీసుకు వచ్చి ఆదాయమార్గాలను పెంపొందించాలని, వైసీపీ హయాంలో కొత్తగా తీసుకువచ్చిన పరిశ్రమలు ఏం ఉన్నాయో చెప్పాలని అన్నారు. రాష్ట్రంలో ఉన్న పరి శ్రమలను, ఐటీ కంపె నీలను పంపించి వేసి నందుకా వృద్ధిరేటు పెరిగిందని ఎద్దేవా చేశారు. వైసీపీ నాయకులు ఇప్పటికైనా వాస్త వాలు చెప్పాలని హితవు పలికారు.

నదుల అనుసంధానంతో రాష్ట్రం సస్యశ్యామలం

● పోలవరం, జలవనరుల ప్రాజెక్టులపై అసెంబ్లీలో మాట్లాడిన చీఫ్ విప్ జీవీ



అసెంబ్లీలో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

వినుకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టును నదుల అనుసంధానంతో రాష్ట్రాన్ని సస్యశ్యామల చేసే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా, కరువు రహితంగా చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ పోలవరం ప్రాజెక్టును, వినుకొండ ప్రాంతానికి కీలకమైన బొల్లాపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేస్తుందని అన్నారు. గోదావరి, పెన్న నదుల అనుసంధానంతో గుంటూరు, ప్రకాశం, రాయలసీమను సస్యశ్యామలం అవుతాయని అన్నారు. గడచిన ఐదేళ్లలో జగన్‌రెడ్డి చేసినంత ద్రోహం రైతులకు ఎవరు చేయలేదని, 2014-2019 మధ్య మొత్తం రూ.7లక్షల కోట్ల బడ్జెట్‌లో సాగునీటి రంగానికి రూ.68293 కోట్లు ఇచ్చి 62 ప్రాజెక్టులకు పనులు మొదలు పెట్టారన్నారు. అందులో 23 ప్రాజెక్టులు పూర్తి చేసిన ఘనత కూడా నాడు చంద్రబాబునాయుడుకే దక్కిందని అన్నారు. తద్వారా 32 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, 7 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు తీసుకురావడం జరిగిందని చెప్పారు. జగన్ హయాంలో సాగునీటికి కేవలం రూ.34 వేల కోట్లు ఖర్చు చేశారని, అందులో జీతాలకే రూ.10 వేల కోట్లు పోయాయన్నారు. దీని ఫలితంగానే రాష్ట్రంలో సాగునీటి రంగం అస్తవ్యస్తంగా మారిందని అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు రివర్స్ టెండరింగ్ పేరుతో సర్వనాశనం చేశారని ధ్వజమెత్తారు. నాడు చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు 71 శాతం ప్రాజెక్టులను పూర్తిచేస్తే జగన్ తనహయాంలో కేవలం 4.8 శాతం మాత్రమే చేయగలిగారని విమర్శించారు. జగన్ అధి కారంలోకి రాకుండా ఉన్న ట్లయితే 2020-21 కే పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేదని అన్నారు. 2014-19 బడ్జెట్‌లో సాగునీటికి 9.7 శాతం ఇస్తే జగన్ 2.7 శాతం మాత్రమే ఖర్చు చేశారని, రాయలసీమ కోసం టీడీపీ ప్రభుత్వం రూ.12,441 కోట్లు ఖర్చుపెడితే నాడు జగన్ ప్రభుత్వం కేవలం రూ.2 వేల కోట్లు ఖర్చు చేసిందని, అది రాయలసీమకు ద్రోహం కాదా అని ప్రశ్నించారు. ఇదే సమయంలో జగన్ ప్రభుత్వంలో 450 ఎత్తి పోతల పథకాలు మూలనపడ్డాయని విమర్శించారు. ట్రాన్స్‌ఫార్మర్లు పోయినా, మోటార్లు రిపేర్లు వచ్చినా, గుండ్లకమ్మ, పులిచింతల గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శించారు.

పంటల బీమాతో ధీమాగా ఉండొచ్చు

● జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు



గుంటూరు సిటీ, నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి): రైతుల పంటలు చేతికి వచ్చే వరకు 'నో గ్యారెంటీ..నో వారంటీ' అన్న రీతిలో ఉంటున్నాయి. వాతావరణంలో సంభ విస్తున్న మార్పులు వల్ల పెట్టుబడులు పెట్టిన అన్న దాత ఎక్కువ సార్లు నష్టపోతున్నారు. ఈ పరిస్థితి నుంచి రైతులను తప్పించేం దుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, పునఃసం స్థాపిత వాతావరణ ఆధారిత పంట బీమా పథకం ప్రవేశపెట్టాయి. వాటి వివరాలు పూర్తిగా తెలుసుకునేందుకు జిల్లా వ్యవసాయ శాఖాధికారి నున్న వెంకటేశ్వర్లుతో 'ఆంధ్రజ్యోతి' ఫటా ఫట్..

పంట బీమా ప్రయోజనం ఏమిటి?

అధికారి: అతితక్కువ ప్రీమియంతో ఎక్కువ లబ్ది చేకూర్చే ప్రక్రియ ఇది. ప్రకృతి విపత్తులు సంభవించి నప్పుడు రైతులకు వెన్ను దన్నుగా ఉండే అవకాశం ఉం టుంది. కేవలం రైతు ప్రయోజనం అంతా పంటల బీమాపై ఆధారపడి ఉంటుంది.

ఏ ఏ పంటలకు భీమా వర్తిస్తుంది..



అధికారి: ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, పునః సంస్థాపిత వాతా వరణ ఆధారిత పంట బీమా పథకం కింద లబ్ధి పొందేందుకు కొన్ని పంటలను గుర్తించాం. మొక్క జొన్న, జొన్న, మినుము, పెసర,పప్పు శెనగ పంటలకు ఈ బీమా వర్తిస్తుంది.

ఏ పంటకు ఎంత బీమా ప్రీమియం చెల్లించాలి?

అధికారి: ఎకరా మొక్కజొన్నకు రూ.114, జొన్నకు రూ.48, మినుముకు రూ.50, పెసరకు రూ.45, పప్పుశెనగకు రూ.70 చొప్పున చెల్లించాలి.

బీమా చెల్లించేందుకు ఎప్పటి వరకు గడువు ఉంది?

అధికారి: పంటల బీమాలో చేరేందుకు డిసెంబర్ 15 వరకు గడువు ఉంది. రైతులు అశ్రద్ధ చేయకుండా ఈ పథకంలో, ఈ-క్రాప్‌లో నమోదు చేయించు కోవాలి.

నమోదు ప్రక్రియలో ముఖ్యమైన విషయాలు ఏమిటి..

అధికారి: బ్యాంకు ద్వారా రుణాలు పొందిన రైతులకు ఆటోమ్యాటిక్‌గా బీమా సొమ్ము కట్ అవుతుంది. రుణాలు పొందని రైతులు స్వయంగా సమీప కామన్ సర్వీస్ సెంటర్‌కు వెళ్లి స్పాట్ నమోదు చేయించుకోవాలి. అందుకోసం ఆధార్ కార్డు,లీజు ఒప్పందం (కౌలు రైతులకు) పంట సాగు విస్తీర్ణ సర్టిఫికెట్, బ్యాంకు అకౌంట్ వివరాలు తీసుకొని వెళ్ళాలి. పంట సాగు సర్టిఫికెట్‌ను గ్రామ అగ్రికల్చరల్ అసిస్టెంట్, గ్రామ హార్టికల్చరల్ అసిస్టెంట్, రైతు సేవ కేంద్రం ఇన్‌చార్జి ద్వారా జారీ చేస్తారు. రైతులు కామన్ సర్వీస్ సెంటర్ లో ఇచ్చిన రశీదు ప్రకారం సరిగ్గా ప్రీమియం చెల్లించాలి.

సబ్ జూనియర్స్ విభాగంలో నంద్యాల జిల్లా ఎడ్ల జతకు ప్రథమ స్థానం



ప్రథమస్థానంలో నిలిచిన నంద్యాల జిల్లా ఎడ్ల జత

దుర్గి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన ఎడ్ల బండలాగుడు పోటీల్లో సబ్ జూనియర్స్ విభాగంలో నంద్యాల జిలా పాణ్యం మండలంలోని ఎస్ కొత్తూరుకు చెందిన బీరం సుబ్రహ్మేశ్వరరెడ్డి ఎడ్ల జత ప్రథమ స్థానంలో నిలిచింది. మండలంలోని ధర్మవరంలో శ్రీహరిహర బాలనాగేంద్రస్వామి వార్షికోత్సవం సందర్భంగా గ్రామంలో ఈ పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానంలో నిలిచిన ఎడ్ల జత నిర్ణీత వ్యవధిలో 4142.9 అడుగుల దూరం లాగింది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సాకేత్‌రెడ్డి, సారికరెడ్డి ఎడ్ల జత 3660 అడుగులు లాగి రెండోస్థానంలో, ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలంలోని గంగన్నపాలెంకు చెందిన ఉమ్మారెడ్డి శ్రీవల్లి ఎడ్ల జత 3502.10 అడుగులు లాగి మూడోస్థానంలో, పల్నాడు జిల్లా నాదెండ్లకు చెందిన దేవభక్తుని శ్రీకాంత్‌చౌదరి ఎడ్లజత 3500 అడుగులు లాగి నాలుగో స్థానంలో, ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలంలోని మద్దిరాల ముప్పాళ్లకు చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి ఎడ్లజత 3446.5 అడుగులు లాగి ఐదో స్థానంలో నిలిచాయి. ఈ పోటీలకు వ్యాఖ్యాతలుగా గూడా శ్రీనివాసరావు, పెద్దిరెడ్డి సుబ్బారెడ్డిలు వ్యవహరించారు. సేద్యం విభాగంలో బుధవారం పోటీలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొలుత జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లుతో కలిసి మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఈ పోటీ లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడ్ల పోటీలు పశుపోషకులకు పండుగ లాంటిదని అన్నారు.గాదె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైసీపీ నేతలు ఎన్నో ఒత్తిళ్లకు ఎదురొడ్డి నిలబడిన ధర్మవరం జనసైనికులు అందరికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. అనంతరం బ్రహ్మానందరెడ్డి, వెంకటేశ్వర్లును కూటమి నేతలు గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో కుర్రి శివారెడ్డి, పులిహరి, పంగులూరి అంజయ్య, యేచూరి సునీతాశంకర్, బీ రామాంజినేయులు, కే అంకారావు, సీహెచ్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

జేకేసీ కళాశాలలో నూతన ఆడిటోరియంను నేడు ప్రారంభించనున్న డీజీపీ



గుంటూరు(విద్య),నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డిజిపి సిహెచ్ ద్వారక తిరుమలరావు బుధవారం నగరానికి రానున్నారు. బుధవారంసాయంత్రం 5 గంటలకు జేకేసీ కళాశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో జాగర్లమూడి లక్ష్మయ్యచౌదరి పేరుతో నిర్మించిన నూతన ఆడిటోరియాన్ని డీజీపీ ద్వారక తిరులమరావు ప్రారంభించనున్నారు.. వినుకొండ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు, ఎపి టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ, కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, జాగర్లమూడి మురళీమోహన్, పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు యార్లగడ్డ ఉమాదేవి, కాకినాడ సీపోర్టు ఛైర్మన్ కెవిరావు తదితరులు పాల్గొననున్నారు.

22 నుంచి డీఆర్ఎం కప్ టోర్నమెంట్



డీఆర్ఎం కప్ టోర్నమెంట్ ట్రోఫీలను ఆవిష్కరిస్తున్న గుంటూరు డీఆర్ఎం ఎం రామకృష్ణ, ఇతర అధికారులు

గుంటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): డీఆర్ఎం కప్ రెండో ఎడిషన్ ఈ నెల 22 నుంచి ప్రారంభం కానున్నట్లు గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం.రామకృష్ణ తెలిపారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మిం టన్, బాస్కెట్ బాల్ క్రీడల్లో పోటీలు జరుగుతాయని చెప్పారు. స్థానిక పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌లో టోర్నమెంట్ వివరాలను డీఆర్ఎం మంగళవారం మీడియాకు వివరించారు. రామకృష్ణ మాట్లాడుతూ ఈ ఏడాది సెకండ్ ఎడిషన్‌ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. క్రికెట్ పోటీలు ఈ నెల 22, 23, 24, 29, 30, డిసెంబరు 1న నల్లపాడులోని రైల్‌విహార్ గ్రౌండ్స్‌లో జరుగుతాయని, విజేతలకు రూ. 75 వేలు, రన్నర్స్‌కు రూ. 50 వేల నగదును అందజేస్తామని వివరించారు. వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్ పోటీలు ఈ నెల 22, 23, 24 తేదీల్లో డీఆర్ఎం ఆఫీసు కాం పౌండ్‌లోని ఆటస్థలాల్లో జరుగుతాయని, వీటిల్లో విజేతలకు రూ. 15 వేలు, రన్నర్స్‌కి రూ.7 వేలు, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ. 3 వేలు అందజేస్తామని వివరించారు. ఈ నెల 20 సాయంత్రం వరకు ఎంట్రీలు పంపవచ్చని తెలిపారు. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని గుంటూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, ప్రకాశం, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లా లకు చెందిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఈ టోర్నమెంట్ పాల్గొనవచ్చని సూచించారు. వివరాలకు సీహెచ్ విజయకుమార్ (9701379911), వై శ్రీనివాసరావు (9347785888) ఆయా నంబర్లలో సంప్రదించాలని సూచిం చారు. సమావేశంలో ఏడీఆర్ఎం కేసైమన్, సీనియర్ డీవోఎం ఎం దినేష్ కుమార్, సీనియర్ అధికారులు షాబాజ్ హనూర్, ప్రదీప్‌కుమార్, విజయకీర్తి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలపై దాడులు ఆపండి

వర్కర్స్ అండ్ హెల్పర్స్ ధర్నా



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న అంగన్ వాడీలు

బెల్లంకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కార్యకర్తలపై దాడులు ఆపాలని సీఐటీయూ పల్నాడు జిల్లా కార్యదర్శి జీ మల్లేశ్వరి అన్నారు. మండల కేంద్రమైన బెల్లంకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్‌తో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బెల్లంకొండ మండలం మన్నె సుల్తాన్ పాలెంకి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త బుజ్జి తన భర్తపై అధికార పార్టీ నాయకులు అంగన్ వాడీ ఉద్యోగానికి రాజీనామా చేయాలని అసభ్యకరంగా తిట్టి ఆమెపై దాడి చేసినట్టు పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న యూనియన్ నాయకులు బెల్లంకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్ వాడీలు తమ సమస్యలపై 42 రోజుల పాటు సమ్మె చేస్తే సమ్మె శిబిరాల వద్దకు వచ్చిన తెలుగుదేశం నాయకులు అంగన్‌వాడీలకు రక్షణగా ఉంటామన్నారని, ప్రతిపక్షంలో ఉండగా రక్షణ కల్పిస్తామని మాట్లాడిన పార్టీ కార్యకర్తలు ఇప్పుడు అంగన్‌వాడీలపై దాడులు చేయడం దుర్మార్గమని విమర్శించారు. అంగన్‌వాడీలు తమ విధుల్లో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలే తప్పా భౌతిక దాడులు చేయడం దుర్మార్గమని అన్నారు. నాయకులు దాడులు ఆపక పోతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చ రించారు. సీఐటీయూ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు జీ రవి బాబు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అంగన్ వాడీ కార్యకర్తల పై, మధ్యాహ్న భోజన కార్మికులపై వేధింపులకు పాల్పడుతున్నారని అన్నారు. ఇటువంటి విధానాన్ని నిరోధించటానికి ఎమ్మెల్యే ప్రవీణ్ చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాలో సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ పుల్లారావు, అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు, అంగన్ వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉదయం పాస్.. సాయంత్రం ఫెయిల్

(5వ పేజీ తరువాయి)

చూపిస్తుంది. జిన్నింగ్ మిల్లుల యజమానులు వినియోగిస్తున్న యంత్రాలకు, సీసీఐ బయ్యర్లు వినియోగిస్తున్న యంత్రాలకు తేడా కనిపిస్తుంది. సీసీఐ కేంద్రాల్లో ప్లాస్టిక్ గోతాల్లో పత్తి తీసుకువస్తే కొనుగోలు చేయడంలేదు. దీంతో రైతులు విడిగానే పత్తిని లోడ్ చేసి తీసుకువస్తున్నారు. మినీ ఆటోల్లో పత్తిని ఎక్కువ మొత్తంలో తొక్కడం వల్ల లోపల వేడి పెరిగి తేమ శాతం పెరిగిపోతుందని రైతులు చెబుతున్నారు. ఒకే లాట్‌లో ఐదు రకాలుగా తేమ శాతం నమోదవుతుంది.

రవాణా భారం తడిసి మోపెడు..

మద్దతు ధర వస్తుందన్న ఆశతో సీసీఐ కేంద్రాలకు రైతులు పత్తిని తరలిస్తున్నారు. అందుకు రవాణా భారం తడిసి మోపెడవుతోంది. అయితే అంత భారం భరించి తీసుకువచ్చిన తర్వాత తేమ శాతం ఎక్కువగా ఉందన్న కారణంతో కొన్ని లాట్లు కొను గోలుకు బయ్యర్లు సుముఖత చూపటం లేదు. దీంతో దానిని వెనక్కి తీసుకెళ్లడంతో రైతులపై అదనపు భారం పడుతుంది. ఉదాహరణకు గుంటూరు మండలం చౌడవరం నుంచి జూటూరి వెంకయ్య అనే రైతు ఐదో మైలు వద్ద ఉన్న జగ్గయ్యపేట కేంద్రానికి 15 క్వింటాళ్ల పత్తిని తీసుకువచ్చేందుకు రూ.2500 వ్యయమైంది. పత్తి లోడ్‌కు క్వింటాల్‌కు రూ.150 కింద ఖర్చు అయ్యింది. తెచ్చిన మొదటి రోజు కొనుగోలు చేయకపోవ డంతో ఆటో వెయిటింగ్ చార్జి కింద రూ.1000 వరకు చెల్లిం చారు. అంత వ్యయం చెల్లించి ఒకరోజు అంతా నిరీక్షించినా తేమ శాతం అధికంగా ఉందని కొనుగోలు చేయలేదు. ఆ పత్తిని తిరిగి తీసుకువెళ్లడం రైతుకు తలకు మించిన భారమైంది. సీసీఐకి తీసుకువచ్చిన పత్తిని తిరిగి తీసుకువెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటుందంటున్న రైతులు ఎంతో కొంత తగ్గించి అయినా కొనుగోలు చేయాలని అధికారులను కోరుతున్నారు.

ధర తగ్గించి అయినా కొనుగోలు చేయాలి

జూటూరి వెంకయ్య, చౌడవరం, గుంటూరు మండలం



సీసీఐ కేంద్రానికి తెచ్చిన పత్తిని తిరిగి తీసుకువెళ్లడం తలకు మించిన భారం. ఒక వేళ తేమ శాతం ఎక్కువగా ఉంటే ధరలో ఎంతో కొంత కోత విధించి పత్తి కొనుగోలు చేయాలి. ఈ విషయంలో అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి.

తేమ శాతం పెంచి కొనుగోలు చేయాలి

మలిపెద్ది లక్ష్మీనారాయణ, కొర్రపాడు, మేడికొండూరు మండలం



ఈ ఏడాది విపరీతంగా వర్షాలు కురిశాయి.ఇప్పుడు చలి కాలం వచ్చేసింది. గాలిలో తేమ శాతం పెరిగిపోయింది. ఇటువంటి పరిస్థితి లో పత్తి ఆరాటం చాలా కష్టం. సీసీఐ అధికారులు తేమ శాతం పెంచి పత్తి ని కొనుగోలు చేయాలి. లేకపోతే పత్తి రైతులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124,135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

39,948 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 43,356 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 39,948 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 31,944 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	14000	334	9800	14000
నెంబరు. 5	9000	11500	నెంబరు. 5	-	-
273	10000	12000	273	-	-
341	8000	15500	341	9000	14500
4884	-	-	4884	14000	14000
సూపర్ 10	-	-	సూపర్ 10	-	-
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	17000	తేజ	9500	16000
బ్యాడిగి	8000	13000	బ్యాడిగి	9000	12800
దేవనూరు డీలక్స్	9000	14000	దేవనూరు డీలక్స్	9500	14500
తెల్లకాయలు	4500	10500	తెల్లకాయలు	5000	10000

మానవ జీవితాలలో ఔషధ రంగం చాలా కీలకం

గుంటూరు(విద్య), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మానవుని నిత్య జీవితంలో ఔషధ రంగం చాలా కీలకంగా ఉంటుందని హైదరాబాద్ న్యూ ల్యాండ్ ప్రయోగ శాల ప్రతినిధి టి.ఏడుకొండలు తెలిపారు. స్థానిక టీజేపీఎస్ కళాశాలలో మంగళవారం పీజీ క్యాంపస్ రసాయన శాస్త్ర విభాగం వారి ఆధ్వర్యంలో 'ఔషధ రంగాలలో ప్రయోగాలు, సాంకేతికత అంశాలు' అనే అంశంపై నిర్వహించిన కార్యశాల(వర్కుషాపు)లో ఆయన మాట్లాడారు. రసాయన శాస్త్ర విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందని, మానవుని జీవితం ఆరోగ్యవంతంగా ఉండటానికి ఔషధాలు ముఖ్యమైన పాత్ర వహిస్తాయని, ఒక ప్రణాళిక ప్రకారం ఔషధాలు తయారు చేసే స్థితిని గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.అనిత, రసాయన శాస్త్ర శాఖాధిపతి ఎల్ఎన్ రాజగోపాల్ అధ్యాపకులు షేక్ సల్మా సుల్తానా పాల్గొన్నారు.

కొనసాగుతున్న 108 ఉద్యోగుల నిరసన

గుంటూరు(తూర్పు), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): 108 అంబులెన్స్ సేవలను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 108 ఉద్యోగుల నిరసన కార్యక్రమాలు జిల్లాలో కొనసాగుతున్నాయి. నల్లరిబ్బన్లు ధరించి మంగళవారం ఉద్యోగులు నిరసనల్లో పాల్గొన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.శివశంకర్, షేక్ బాబు మాట్లాడుతూ అత్యవసర విభాగాల సేవలు నిర్వహిస్తున్న తమకు నెల వేతనాల కోసం ఎదురుచూపులు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సమస్యలను పరిష్కరించని నేపథ్యంలో ఈనెల 25వ తేదీ తరువాత అన్ని రకాల అత్యవసర సేవలు నిలిపివేస్తూ నిరవధిక సమ్మెకు దిగేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. నిరసనల్లో నాయకులు ఏ.రామకృష్ణ, యెహోషువా, హస్సన్, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ నందకిషోర్

● జోనల్ సంయుక్త కార్యదర్శిగా సేవకుమార్


డాక్టర్ నందకిషోర్

గుంటూరు మెడికల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర శాఖ నూతన అధ్యక్షుడిగా డాక్టర్ గార్లపాటి నందకిషోర్, జోనల్ సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ తాతా సేవకుమార్ ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ వై సుబ్బారాయుడు, డాక్టర్ బి సాయికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరుకు చెందిన ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ నందకిషోర్ 2024-25 సంవత్సరానికి ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరిస్తారని వారు తెలిపారు. గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో ఈ నెల 23వ తేదీన జరిగే 66వ ఐఎంఏ రాష్ట్ర సదస్సులో ఏపీ నూతన అధ్యక్షుడుగా డాక్టర్ నందకిషోర్, జోనల్ సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ సేవకుమార్ ప్రమాణ స్వీకారం చేస్తారని వారు వెల్లడించారు. బాపట్ల జిల్లా చీరాల స్వస్థలమైన డాక్టర్ నందకిషోర్, సిద్ధార్థ, గుంటూరు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కాలేజీలో చెవి, ముక్కు, గొంతు వైద్య విభాగంలో ఎంఎస్ పూర్తి చేశారు. అనంతరం అపోలో, దక్కన్, కాటూరి వైద్య కళాశాలల్లో అధ్యాపకులుగా వివిధ హోదాల్లో పని చేశారు.

24న యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు

గుంటూరు(విద్య), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) స్వర్ణోత్సవ మహాసభలు ఈనెల 24న గుంటూరు ఎన్జీవో కళ్యాణమండపంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ తెలిపారు మహాసభల పోస్టర్సను మంగళవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆవిష్కరించారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రాథమిక విద్యారంగాన్ని బలోపేతం చేసుకోవడం ద్వారానే ప్రభుత్వ బడులు బలోపేతం అవుతాయని, ఆ బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలని కోరారు. స్వర్ణోత్సవాల సందర్భంగా రాష్ట్రానికి ఉపయోగపడే ప్రత్యామ్నాయ విద్యా విధానాన్ని రూపొందిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచురణ విభాగం ఛైర్మన్ ఎం. హనుమంతరావు, జిల్లా సహాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కోశాధికారి ఎండి దౌలా, జిల్లా కార్యదర్శులు ఆదినారాయణ, వెంకటేశ్వరరావు, గోవిందయ్య, అడవి శ్రీనివాసరావు, ప్రేమ్‌కుమార్, కోటిరెడ్డి, ప్రభుజీ తదితరులు పాల్గొన్నారు

వినూత్న పద్ధతుల్లో విద్యార్థులకు బోధనందించాలి

గుంటూరు(విద్య), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ఉపయోగించి వినూత్న పద్ధతుల్లో బోధన అందించాలని ఉర్దూ డీఐ ఎస్‌కెఎండీ ఖాసిం అన్నారు. చౌత్రాసెంటర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని ఉర్దూ కాంప్లెక్స్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు నేర్చుకున్న విషయాలను విద్యార్థులకు మెరుగైన పద్ధతుల్లో బోధించాలని సూచించారు. తూర్పు ఎంఈవో అబ్దుల్ ఖుద్దూస్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు అనుసరించే బోధన విధానాలు పిల్లలు ఆకట్టుకునే విధంగా ఉండాలని అన్నారు. పాఠశాల సముదాయ ఛైర్మన్ వసుంధర, వివిధ మండలాలకు సంబంధించిన ఉర్దూ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక

గుంటూరు(విద్య),నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సర్వసభ్య సమావేశం మంగళగిరిలోని వీవర్స్‌కాలనీలో జరిగింది. సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా యర్లగడ్డ శ్రీనివాసరావు, కార్యదర్శిగా చుక్కా కొండయ్య, కోశాధికారిగా గంగాధర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అశోక్‌బాబు ఎన్నికయ్యారు. కమిటీ నాయకులు డీఈవోను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పాఠశాలల్లో క్రమశిక్షణతోపాటు, క్రీడాభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని డీఈవో రేణుక సూచించారు.

గాలిలో ధూళి శాతం గణనీయంగా తగ్గించాలి

● కలెక్టర్ నాగలక్ష్మి


పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, కమిషనర్

గుంటూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని గాలిలో ధూళి శాతం గణనీయంగా తగ్గించి నాణ్యత ప్రమాణాల పెంపుదలకు నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాంలో నిర్దేశించిన కార్యక్రమాలు సక్రమంగా అమలు జరిగేలా చూడాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌సీఏపీ) 2024-25 జిల్లా స్థాయి అమలు కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు గుంటూరు నగరంలో గాలి కాలుష్య కారకాలు, గాలి నాణ్యత ప్రమాణాలు, వివిధ శాఖలు యాక్షన్ ప్లాన్‌లో ప్రతిపాదించిన పనులు, మార్గదర్శకాలపై రూపొందించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. నగర రహదారులపై దుమ్ము ధూళి లేకుండా ప్రతి రోజు సక్రమంగా శుభ్రం చేయటంతో పాటు, ప్రధాన రహదారులలో డ్రైయిన్ టూ డ్రైయిన్ రోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. స్వచ్ఛమైన గాలి కోసం నగరంలోని అన్ని ప్రాంతాల్లో విరివిగా మొక్కలు పెంచాలన్నారు. ఎన్‌సీఏపీ 2024 -25 నిధులు రూ.2.73 కోట్ల అంచనా వ్యయంతో గుంటూరు నగరపాలక సంస్థ రహదారుల అభివృద్ధికి రవాణాశాఖ వాహనాల పొల్యూషన్ తనిఖీ వాహనం కొనుగోలుకు సంబంధించిన ప్రతిపాదనలను కలెక్టర్ ప్రాథమికంగా ఆమోదించారు. ఈ సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ఎండీ నజీన బేగం, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు ఎ జయలక్ష్మి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కోమలి పద్మ, ఆర్టీసీ ఆర్ఎం ఎం రవికాంత్, నగర పాలకసంస్థ ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, ఈఈ సుందరరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత కార్యక్రమాలు కొనసాగేలా అవగాహన

గుంటూరు సిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛత కార్యక్రమాలను నిరంతరం కొనసాగేలా ప్రజలకు అవగాహన కల్పించటం ద్వారానే పారిశుద్ధ్యం మెరుగుదల, ఆరోగ్యకరమైన, ఆహ్లాదకర వాతావరణంను పెంపొందించటం సాధ్యం అవుతుందని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో కలెక్టర్ నాగలక్ష్మి, అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌తో కలసి ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవ కార్యక్రమంలో భాగంగా జరిగిన జిల్లా వాటర్ శానిటేషన్ మిషన్ సమావేశంలో పాల్గొన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం ప్రచార పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించి, స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞను చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని నవంబరు 19వ తేదీ నుంచి డిసెంబరు 10 మానవ హక్కుల దినోత్సవం వరకు నిర్వహిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో నిరంతరం సక్రమంగా అమలు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో గుడివాడ సర్పంచి రాకేష్, గొడవర్రు సర్పంచి బీరం జానకీదేవి, వెంగళాయపాలెం సర్పంచి నల్లపాలి లలితకుమారి, పేరేచర్ల సర్పంచి దేవరకొండరాజ్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ కె.కళ్యాణ చక్రవర్తి, డీపీవో సాయికుమార్, జిల్లా భూగర్భ జల వనరుల శాఖ డిప్యూటీ డైరక్టర్ వందనం తదితర అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తా : డేగల ప్రభాకర్


ఎంఎస్ఎంఈ మంత్రితో డేగల ప్రభాకర్

గుంటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈ శాఖతో సమన్వయం చేసుకుని పారిశ్రామికాభివృద్ధికి కృషి చేస్తానని ఏపీ పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. సచివాలయంలో ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను మంగళవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంఎస్ఎంఈల స్థాపనతో ఎక్కువ మందికి ఉపాధి లభిస్తుందని, పెట్టుబడి తక్కువ కావడంతో ఔత్సాహిక, యువ పారిశ్రామిక వేత్తలు పెద్ద సంఖ్యలో ముందుకు వస్తారని, వారిని ప్రోత్సహించే దిశగా కృషి చేస్తానని డేగల మంత్రితో చెప్పారు.

పాఠశాలల పనిగంటలు పెంపు అశాస్త్రీయమైన విధానం : ఏపీటీఎఫ్

గుంటూరు(విద్య), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పనిగంటలు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పొడిగించడం అశాస్త్రీయమని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారులు ఆదేశాలతో పైలట్ ప్రాజెక్ట్‌గా జిల్లాలో మండలానికి ఒక ఉన్నత పాఠశాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు పెంచడం విద్యార్థులకు మేలు చేయకపోగా విశ్రాంతి లేకుండా ఆటలు లేక విద్యా ప్రగతి కుంటుబడుతుందన్నారు. ఉపాధ్యాయులకు నిర్విరామంగా 8 గంటలకు మించి తరగతులు ఉంటే బోధనా ప్రమాణాలు సన్నగిల్లుతాయన్నారు.

పాఠశాలల సమయం పెంచడం సహేతుకం కాదు : ఎస్టీయూ

ఉన్నత పాఠశాలలు, హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో పాఠశాల సమయాన్ని పెంచటం సహేతుకం కాదని, ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు రాష్ట్రోపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డి.పెదబాబు, డీకే సుబ్బారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలలో అనేక రకాల యాప్‌లతో ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, అదేవిధంగా అనేకమైన బోధనేతర కార్యక్రమాలతో బోధనకు ఆటంకం కలుగుతున్నదని, వాటిని తొలిగించాల్సిందిపోయి పాఠశాలల పని వేళలు పెంచుటకు నిర్ణయించడం సహేతుకం కాదన్నారు. నూతన పనివేళల వలన రవాణా సౌకర్యాలు సరిగా లేనిచోట ఉపాధ్యాయులు, విద్యార్థులు అసౌకర్యానికి గురయ్యే అవకాశం ఉండి తద్వారా బోధనకు ఆటంకం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

రేపటి నుంచి నగరంలో శ్రీ విధుశేఖర భారతీ మహాస్వామి పర్యటన

గుంటూరు(తూర్పు), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విజయయాత్ర మహోత్సవంలో భాగంగా దక్షిణామ్నాయ శృంగేరీ పీఠాధీశ్వరులు శ్రీ విధుశేఖర భారతీ స్వామి నగరంలో ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు పర్యటించనున్నారని శృంగేరి శంకర మఠం, శ్రీ శారద పరమేశ్వరి దేవస్థానం ఆలయ గౌరవ ప్రతినిధి పోలిశెట్టి నాగసుందరం తెలిపారు. స్థానిక సంపత్‌నగర్‌లో శ్రీ శారదా పరమేశ్వరి దేవస్థానంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయయాత్రలో భాగంగా 21న స్థానిక ఆర్.అగ్రహారం, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం నుంచి సంపత్‌నగర్‌లో శ్రీ శారదా పరమేశ్వరి దేవస్థానం వరకు మహాస్వామి వారికి శోభాయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. 22, 23 తేదీలలో మహాస్వామి వారి దర్శనం, రాత్రి 8.30 గంటలకు మహాస్వామి వారి చేతుల మీదగా శ్రీ శారద చంద్రమౌళీశ్వరుల పూజా కార్యక్రమం జరుగుతుందన్నారు. 24న మధ్యాహ్నంతో పర్యటన ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో ఆలయ వేద పండితులు నాగరాజ శర్మ, విష్ణుభట్ల ఆంజనేయ చయనులు, గుంటూరు మండల వేద ప్రవర్ధక విద్వత్పరీక్ష సభ అధ్యక్షుడు గబ్బిట శివరామ కృష్ణ ప్రసాదు పాల్గొన్నారు.

కార్తీక దీపం భక్తిశ్రద్ధలతో వెలుగులు నింపే పండుగ

● డాక్టర్ లావు రత్తయ్య


దీపోత్సవంలో పాల్గొన్న విద్యార్థినులు

గుంటూరు(విద్య), నవంబరు 19 : స్థానిక వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీ ఆవరణలో కార్తీకదీప కాంతుల ప్రజ్వలనతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. కార్తీక మాసం సందర్భంగా యూనివర్సిటీ ప్రాంగణంలో శోభాయమానంగా తీర్చిదిద్దిన రంగవల్లికలో పరమశివున్ని లింగాకృతిలో ఆవిష్కరించారు. అనంతరం శివున్ని స్తుతిస్తూ కోటి దీపాలను ప్రజ్వలన గావించి, అభిషేకాలు నిర్వహించి భక్తిని చాటుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన విజ్ఞాన్స్ సంస్థల చైర్మన్ లావు రత్తయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్తీక మాసం హిందూ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైనదన్నారు. కార్తీక మాసంలో వ్రతాలు ఆచరిస్తే మంచిదని, దానితో పాటు సత్యనారాయణ స్వామి వ్రతం, కేదారేశ్వర వ్రతాలు జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలోత్సవ్‌లో భాష్యం బ్లూమ్స్ విద్యార్థుల ప్రతిభ


బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

గుంటూరు(విద్య),నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నంబూరు వీవీఐటీలో ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు జరిగిన బాలోత్సవ్ లో భాష్యం బ్లూమ్స్ విద్యార్థినీ, విద్యార్థులు వివిధ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు జడ్ఈవో వరలక్ష్మి తెలిపారు. కీబోర్డ్ లో యోగానంద శాస్త్రి ప్రథమ బహుమతి, జూనియర్స్ విభాగంలో రెండో బహుమతి, కూచిపూడిలో నిఖిత లక్ష్మి రెండో బహుమతి, జానపద నృత్యంలో దీపిక మూడో బహుమతి, క్లాసికల్ డాన్స్‌లో సంస్కృతి మూడో బహుమతి, యోగానంద శాస్త్రి కూచిపూడిలో నాలుగో బహుమతిని అందుకున్నట్లు ఆమె తెలిపారు. పోటీలో గెలుపొందిన విజేతలను జడ్ఈవో వరలక్ష్మి అభినందించారు.

కళ్ళం ఇంజనీరింగ్ కళాశాలలో టెక్ క్యాంపు

గుంటూరు(విద్య),నవంబరు 19(ఆంధ్రజ్యోతి): చౌడవరంలోని కళ్ళం హరనాథరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం టెక్ క్యాంపు, గూగుల్-ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెషిన్ లెర్నింగ్‌పై ఇంజనీరింగ్ విద్యార్థులకి శిక్షణ తరగతులను నిర్వహించారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకరరెడ్డి తెలిపారు. శిక్షణ కార్యక్రమాన్ని ఏఐసీటీఈ, ఎడ్యుస్కిల్స్ ఆధ్వర్యంలో నిర్వహించామని ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి తెలిపారు.

రంగంలోకి సీసీఐ ప్రత్యేక పర్యవేక్షణ అధికారి

● 'పెమ్మసాని' జోక్యంతో పత్తి రైతులకు ఊరట

గుంటూరు సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతుల సమస్యలను పరిష్కరించేందుకు బుధవారం నుంచి సీసీఐ మార్కెటింగ్ డైరెక్టర్ విజయ్ కురదగీ గుంటూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కార్యాలయానికి సీసీఐ ప్రధాన కార్యాలయం నుంచి సమాచారం అందింది. పర్యవేక్షణ అధికారి మంగళవారం రాత్రికే గుంటూరు చేరుకున్నారు. పత్తి కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యంపై గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు రైతులు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. వట్టిచెరుకూరు మండలం కుర్నూతల వద్ద ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాన్ని కేంద్ర మంత్రి గత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ పత్తి రైతులు కొనుగోలు లో ఎదురౌతున్న ఇబ్బందులను పెమ్మసాని దృష్టికి తీసుకువచ్చారు. రైతు సమస్యలపై సత్వరం స్పందించిన పెమ్మసాని సోమవారం కేంద్ర జౌళీ శాఖ మంత్రి, సీసీఐ కేంద్ర కార్యాలయం అధికారుల దృష్టికి ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సీసీఐ కేంద్రాల్లో రైతులు పడుతున్న ఇబ్బందులను, అధికారుల నిర్లక్ష్య వైఖరిని తీసుకువెళ్లారు. పెమ్మసాని చేసిన విజ్ఞప్తి పై వెంటనే స్పందించిన సీసీఐ కేంద్ర కార్యాలయం ఆంధ్రాలో పత్తి కొనుగోలు వ్యవహారం పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారిని నియమిస్తామని హామీ ఇచ్చింది. హామీ కి తగ్గట్టుగా సీసీఐ మార్కెటింగ్ డైరెక్టర్ విజయ్ కురదగీ గుంటూరు జిల్లాకు వెళ్లాలని ఆదేశించింది. పెమ్మసాని చూపిన చొరవతో పత్తి రైతుల బాధలకు శాశ్వత పరిష్కారం దొరకనుంది.

షటిల్ బ్యాడ్మింటన్‌లో సీతారామయ్య హైస్కూల్ విద్యార్థిని ప్రతిభ

గుంటూరు కార్పొరేషన్, అక్టోబర్ 19(ఆంధ్రజ్యోతి): డెకత్లన్ గుంటూరు వారిచే ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 18న నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ స్పోర్ట్స్ ఉత్సవ్ పోటీలలో పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని పి.శ్రావణి అండర్ -15 సింగిల్స్‌లో మొదటి బహుమతి, ఓపెన్ డబుల్‌లో మొదటి బహుమతి కైవసం చేసుకున్నట్లు పాఠశాల గౌరవాధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ, సెక్రటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ అభినందించారు. పాఠశాలలో మంగళవారం విద్యార్థినికి బహుమతిని అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపల్ కర్లపూడి పార్వతిదేవి, కోఆర్డినేటర్స్ దుర్గా శ్యామ్, తిరువీధుల శ్రీదేవి పాల్గొని విద్యార్థినిని అభినందించారు.

సంక్షేమ పాలనలో ఇందిరాగాంధీది చెరగని ముద్ర

గుంటూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): దేశంలో అభివృద్ధి, సంక్షేమ పాలనలో ఇందిరాగాంధీ చెరగని ముద్ర వేశారని ఏపీసీసీ అధికార ప్రతినిధి షేక్ మస్తాన్‌వలి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీభవన్‌లో మంగళవారం మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ 107వ జయంతి కార్యక్రమం జరిగింది. లింగంశెట్టి మాట్లాడుతూ ఇందిరాగాంధీ అనేక సాహసోపేతమైన చర్యలతో ఆమె ఉక్కు మహిళగా పేరుగడించారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాచకొండ జాన్‌బాబు, బిళ్ళా సునీల్, బొట్ల బ్రహ్మం, వెంకటరెడ్డి, కట్టా జవహర్‌బాబు, మహమూద్, రామకృష్ణ, మోషే తదితరులున్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో దివంగత ఇందిరాగాంధీ జయంతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, ఉపాధ్యాయ నాయకులు ఏపీ రామారావు, ఎస్పీ జోస్టిన్, జాకబ్, ఎంవీ సత్యనారాయణ, రాజన్న మాష్టారు తదితరులున్నారు.

25న జీజీహెచ్‌లో అర్హులైన వారికి వినికిడి యంత్రాలు పంపిణీ

గుంటూరు(విద్య), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జీజీహెచ్‌లో ఈనెల 25న అర్హులైన వారికి వినికిడి యంత్రాలు పంపిణీ చేయనున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్స్, వృద్ధుల సంక్షేమశాఖాధికారి సువార్త మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలీయావర్‌జంగ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ డిజబిలిటిస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కార్యకర్తల క్షేమం, ప్రజా సంక్షేమమే వైసీపీ లక్ష్యం : అప్పిరెడ్డి

గుంటూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల క్షేమం, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైసీపీ పని చేస్తుందని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి తెలిపారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన షేక్ మస్తాన్‌వలిని శాలువా, పుష్పగుచ్ఛంతో ఆయన మంగళవారం అభినందనలు తెలియజేశారు. అనంతరం అప్పిరెడ్డి మాట్లాడుతూ పార్టీ అభ్యున్నతికి మస్తాన్‌వలి మరింత కీలకంగా పనిచేయాలని కోరారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు మందపాటి శేషగిరిరావు, కార్పొరేటర్లు ఈచంపాటి ఆచారి, పాపతోటి అంబేద్కర్, ధూపాటి వంశీ తదితరులున్నారు.

సోషల్ మీడియా పోస్టులపై వైసీపీ నేతల ఫిర్యాదు

గుంటూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్‌తో పాటు ఆ పార్టీ నాయకులపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెడుతోన్న కూటమి పార్టీల నాయకులపై వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆ పార్టీ నాయకులు మంగళవారం పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో అంబటి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను కంట్రోల్ చేయలేక సోషల్ మీడియా యాక్టివిస్టులను భయభ్రాంతులకు గురిచేయాలన్న ఉద్దేశ్యంతో కార్యకర్తలను కేసులతో వేధించటం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో వైసీపీ నగర అధ్యక్షుడు డైమండ్‌బాబు, నూరిఫాతిమా, నిమ్మకాయల రాజనారాయణ, పోలూరి వెంకటరెడ్డి, నూనె ఉమామహేశ్వరరెడ్డి తదితరులున్నారు.

నేడు పట్టాభిపురం కేసులో కోర్టుకు రౌడీషీటర్ బోరుగడ్డ

గుంటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో ఈ ఏడాది జూన్ 3న నమోదైన కేసులో రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌ను పీటీ వారెంట్‌పై బుధవారం గుంటూరు కోర్టులో హాజరుపరచనున్నారు. తుళ్లూరు పోలీస్‌స్టేషన్లో గత ఎన్నికల సమయంలో బోరుగడ్డ అనిల్‌పై నమోదైన రెండు కేసుల్లో తుళ్లూరు పోలీసులు సోమ, మంగళవారాల్లో ఆయనను రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి కస్టడీకి తీసుకొని విచారించారు. కాగా పట్టాభిపురం పోలీస్‌స్టేషన్లో నమోదైన కేసులో బుధవారం సాయంత్రం 5 గంటలలోపు గుంటూరులోని కోర్టులో హాజరు పరచనున్నారు.

పోలీసుల అదుపులో అంతర రాష్ట్ర దొంగ

ముంబైలో అంతర రాష్ట్ర దొంగను పట్టాభిపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొద్ది నెలల క్రితం చంద్రమౌళీనగర్‌లో ఓ విశ్రాంత డీఎస్పీ పెంచలనాయుడు ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో భారీగానే సొత్తు అపహరించుకుపోయారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను హైదరాబాద్‌కు చెందిన ముఠాగా గుర్తించారు. వీరు కొంత కాలంగా ముంబైలో ఉంటూ అక్కడ నేరాలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందింది. రెండు రోజుల క్రితం పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు సిబ్బందితో ముంబై వెళ్లి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని వారి నుంచి బంగారం రికవరీ చేసినట్లు తెలిసింది.

నేడు గార్డెన్స్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుంటూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా బృందావన్‌గార్డెన్స్‌లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు.


ఎన్టీఆర్ స్టేడియాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవి

ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధికి కృషి చేస్తాం

● పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి

గుంటూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గల్లా మాధవి హామీ ఇచ్చారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి ఎమ్మెల్యే మంగళవారం పర్యటించారు. అనంతరం స్టేడియంలోనే వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. వర్షాకాలంలో ట్రాక్ మొత్తం చిత్తడిగా మారిపోతుందని దాని వలన వృద్ధులు మహిళలు ఇబ్బందిపడుతున్నారని వాకర్లు ఎమ్మెల్యేకి తెలిపారు. టెన్నిస్ కోర్టులో లైటింగ్ సమస్య ఉందని, టేబుల్ టెన్నిస్ ఒక టేబుల్ మాత్రమే ఉందని, దానిని ఆరు టేబుల్స్‌కు పెంచాలని కోరారు. జిమ్ సెంటర్లోని పరికరాలు పాతవిగా ఉన్నాయని, వీటి స్థానంలో కొత్తవి కొనుగోలు చేయాలని కోరారు. స్విమ్మింగ్ పూల్ నిర్వహణ సరిగ్గా లేదని, ఆధునికీకరించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. దానిపై ఎమ్మెల్యే మాధవి స్పందిస్తూ కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలసి సమస్యలు లేకుండా చేసి,స్టేడియంను అభివృద్ధి పరుస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు, దామచర్ల శ్రీనివాసరావు, ముత్తినేని రాజేష్, నరేంద్ర, వజ్జ రామకృష్ణ, లాల్‌వజీర్ పాల్గొన్నారు.

పశ్చిమలో వంద శాశ్వత సభ్యత్వాలు లక్ష్యం

37వ డివిజన్లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో లక్ష రూపాయల శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్న టీడీపీ సీనియర్ నాయకుడు షేక్ లాల్ వజీర్‌ను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి అభినందించారు. నియోజకవర్గంలో వంద శాశ్వత సభ్యత్వాలు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆమె తెలిపారు.

కొత్తపేట మోడల్ పోలీస్‌స్టేషన్ నిర్మాణం ప్రారంభించాలి

● అసెంబ్లీలో తూర్పు ఎమ్మెల్యే నసీర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గుంటూరు కొత్తపేట మోడల్ పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ కోరారు. శాసనసభ ఏడో రోజు సమావేశాల్లో భాగంగా మంగళవారం ఆయన సభలో మాట్లాడారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలో ఉన్న మూడు పోలీస్ స్టేషన్లలో రెండు స్టేషన్లు తెలుగుదేశం ప్రభుత్వంలో ముఖ్య మంత్రి చంద్రబాబు మోడల్‌గా నిర్మించారన్నారు. కొత్తపేట పోలీస్ స్టేషన్‌ను పడగొట్టి ప్రతిపాదన తయారు చేయగా, గత ప్రభుత్వంలో స్టేషన్ నిర్మాణానికి కనీసం ఒక్క ఇటుక కూడా పెట్టే లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో కొత్త పేట మోడల్ పోలీస్‌స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ముఖ్య మంత్రి, హోం మంత్రి చొరవ చూపి, శాంతి భద్రతలు కాపాడే పోలీస్‌కు పోలీస్ స్టేషన్‌ను నిర్మించి ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని గంజాయికి కేంద్రంగా మార్చిందని, గంజాయి, డ్రగ్స్‌ను కట్టడి చేసి గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్‌గా చేయాల్సిన బాధ్యత ఉందని, హోం శాఖ వాటిపై ప్రత్యేక దృష్టి సాధించాలని కోరారు.


వీధి వ్యాపారులకు మార్కింగ్ ఇస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

పూడికతీత పనులు వేగవంతం చేయాలి : కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, నవంబర్ 19(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో డ్రెయిన్లు, రోడ్ల ఆక్రమణలు తొలగించిన ప్రాంతాల్లో పూడికతీత పనులు వేగంగా చేపట్టాలని జీఎంసి ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ మంగళవారం కొరిటెపాడు నుంచి గుజ్జనగుండ్ల సెంటర్ వరకు జీఎంసీ చేపట్టిన డ్రెయిన్, రోడ్ ఆక్రమణల తొలగింపు ప్రక్రియను, గుజ్జనగుండ్ల పాలిటెక్నిక్ కాలేజి దగ్గర వెండింగ్ జోన్ ఏర్పాటు మార్కింగ్‌లను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ తొలుత డ్రెయిన్ ఆక్రమణలను పరిశీలించి, ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించుకోని వాటిని బుధవారానికి తొలగించాలని, తిరిగి ఏర్పాటు చేయకుండా పర్యవేక్షణ చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. పర్యటనలో సిటి ప్లానర్ రాంబాబు, ఏసీపీ రెహ్మాన్, డీఈఈ రమేష్ బాబు, ఎస్ఎస్ సోమశేఖర్, ఏఈ చైతన్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

జీఎంసీకి సకాలంలో పన్నులు చెల్లించండి : కమిషనర్

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో సకాలంలో పన్ను చెల్లించడం, ఇంకుడు గుంతల ఏర్పాటు, నగర అభివృద్ధిలో భాగస్వాములు అయ్యే ప్రజలకు ప్రత్యేక యాప్ ద్వారా సిటిజన్ రివార్డ్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో సోషల్ ఇంపాక్ట్ ఇన్నోవేషన్ సంస్థ ప్రతినిధి సమీర్ గౌతమ్ సిటిజన్ రివార్డ్స్ అమలు, ప్రజలు వినియోగించుకునే తీరుని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజలు స్వచ్ఛ గుంటూరులో, నగరాభివృద్ధిలో భాగస్వాములు కావడానికి జీఎంసి నుంచి ప్రోత్సాహకంగా ప్రత్యేకంగా సిటిజన్ రివార్డ్స్‌ని అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అందులో భాగంగా సమీర్ గౌతమ్ మంగళవారం వివరాలను విభాగాధిపతులకు వివరించారని, త్వరలో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తామన్నారు. నగర ప్రజలు పన్నులు సకాలంలో చెల్లించడం, వ్యర్థాలను వేర్వేరుగా అందించడం, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం ద్వారానే ప్రత్యేక యాప్ ద్వారా అందించే క్యూఆర్ కోడ్ ద్వారా రివార్డ్స్ అందేలా జీఎంసీ చేపడుతుందన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ సీహెచ్ ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

12 మంది నోడల్ అధికారులకు షోకాజ్ నోటీసులు

ఎన్పీసీఐ సర్వే, జియో ట్యాగింగ్ పర్యవేక్షణ లోపంపై 12 మంది నోడల్ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వార్డు సచివాలయ కార్యదర్శుల ద్వారా జరుగుతున్న నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పీసీఐ) సర్వే, ఇళ్ల జియో ట్యాగింగ్ వేగవంతంపై మౌఖికంగాను, టెలీకాన్ఫరెన్స్ ద్వారాను ఆదేశించినా ఆశించిన స్థాయిలో ఆయా నోడల్ అధికారుల పరిధిలో సర్వే వేగవంతం కాలేదన్నారు. ఎన్పీసీఐ సర్వేకి సంబంధించి బి.భవ్య సాయి, సీహెచ్ నాగేశ్వరరావు, హెచ్.వెంకటేశ్వర్లు, కె.సుబ్బారావు, పి.వెంకట్రావు, ఆర్.నాగవేణి, ఎస్‌కే నసీర్ అహమ్మద్‌లకు, హౌసింగ్ జియో ట్యాగ్‌కి సంబంధించి కె.నాగరాజు, సీహెచ్ నాగేశ్వరరావు, ఎన్.ఆనంద కుమార్, ఎస్.అనిల్ కుమార్, ఆర్.నాగవేణిలకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని తెలిపారు.

శ్రీ రామలింగేశ్వరస్వామికి అన్నాభిషేకం

గుంటూరు(తూర్పు), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక మల్లారెడ్డి నగర్ శ్రీ ధర్మశాస్త అయ్యప్ప స్వామి దేవాలయం ప్రాంగణంలోని శివాలయంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి ఉదయం భక్తి శ్రద్ధలతో పంచామృతాభిషేకం, అనంతరం విశేషంగా అన్నాభిషేకం జరిగాయి. శ్రీ గణపతి సహిత రుద్ర హోమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఏంకేఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

వాయిద్యం అంటే ఆమెకు ప్రాణం... డోలుపై ఆమెకు మరింత మక్కువ. మగవారే కాదు... మహిళలూ వాయిద్యాలతో అద్భుతాలు సృష్టించగలరని నిరూపించారామె. డోలు పట్టుకుంటే సున్నితమైన ఆమె చేతివేళ్లు దానిపై లయబద్ధంగా నాట్యం చేస్తాయి... 108 తాళాలు శ్రవణానందకరంగా ఉర్రూతలూగిపోతాయి. ఒకటి కాదు... రెండు కాదు ఏకంగా 1000కి పైగా కచేరీలు చేయటం ఒక ఘనతయితే, డోలు వాయిద్యంలో పీజీ చేసిన తొలి మహిళగా, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో స్థానం సాధించటం మరో ప్రత్యేకత.



డోలు వాయిస్తున్న మనీషా బాబీ (లలిత మనీషా)

లలిత మనోహరం డోలు వాయిద్యం

- తెనాలికి చెందిన లలిత మనీషాఅద్భుత ప్రదర్శనలు
- డోలు వాయిద్యంలో పీజీ చేసిన తొలి మహిళగా ఘనత
- తల్లిదండ్రుల స్ఫూర్తితో గిన్నిస్ రికార్డులూ సొంతం



మంత్రి మనోహర్ దగ్గర కుటుంబ సభ్యులకు సత్కారం

తెనాలి, నవంబరు 19, (ఆంధ్రజ్యోతి): ఆమె పేరు లలిత మనీషా(మనీషా బాబీ). తెనాలికి చెందిన వెంకటేశ్వర సాహెబ్, మస్తాన్‌బీల కుమార్తె లలిత మనీషా. ఆమె తల్లిదండ్రులు కూడా సన్నాయి వాయిద్యంలో దిట్టయితే, వీరి దారిలోనే కుమార్తెకూడా అడుగులు వేశారు. ఎవరైనీ తమ పిల్లలను తాము చేస్తున్న వృత్తి కాకుండా మరింత ఉన్నత చదువులు చదివించాలని, ఉన్నతస్థానంలో నిలపాలని తాపత్రయపడతారు. అయితే మనీషా తల్లిదండ్రులు కూడా ఆమె ఇష్టానికే ప్రాధాన్యం ఇచ్చారు. మనలో దాగిన నైపుణ్యాన్ని వెలికితియ్యటానికి పరుగులుపెట్టాల్సిన పనిలేదని, ఏదిఇష్టమో దానిలో రాణించగలిగితే రికార్డులు సృష్టించవచ్చని మనీషా నిరూపించారు. కళలకు నిలయమైన తెనాలికే గర్వకారణంగా నిలిచారు.

చిన్నప్పటి నుంచే డోలుపట్టి...

మనీషాకు చిన్నప్పటి నుంచి సంగీతం అంటే ఇష్టం. ఆమె తాత నాసర్ మస్తాన్ ప్రముఖ నాదస్వర విద్వాంశులు. అయితే తన తల్లిదండ్రులు సన్నాయి వాయిద్యంలో ప్రావీణ్యం కలిగినవారు కావటం, నాదస్వరంలో ప్రత్యేకతను చాటటంతో, చిన్నప్పటి నుంచి వాటిని చూస్తూ వాయిద్యాలపై ఆమె మక్కువ పెంచుకున్నారు. పాఠశాల విద్య చదువుతున్న రోజుల్లోనే డోలు పట్టుకున్నారు. లేత చేతులతో డోలుపై తాళాలు వేయగలిగారు. ఆమెకున్న ఆసక్తిని గుర్తించిన తల్లిదండ్రులు డోలు వాయిద్యం విషయంలో ప్రోత్సహించారు. చదువుకుంటూనే అనేక కార్యక్రమాల్లో పాల్గొని, కచేరీలు చేయటం విశేషం. తెనాలిలోనే పాఠశాల విద్య, ఉన్నత విద్య బీసీఏ కూడా తెనాలిలోనే పూర్తిచేశారు. తర్వాత హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో మ్యూజిక్(డోలు)లో డిప్లమో చేశారు. అనంతరం తమిళనాడులోని అన్నామలై యూనివర్శిటీ, చిదంబరంలో డోలు వాయిద్యంపై పీజీ పూర్తిచేశారు. అయితే డోలు వాయిద్యంలో పీజీ చేసిన తొలి మహిళగా గుర్తింపు తెచ్చుకున్నారు. మొదట డోలు విద్వాంసులు టీఆర్ సుబ్రహ్మణ్యం దగ్గర డోలు నేర్చుకున్నారు. చిదంబరంలో డోలు విద్వాంసులు టీజీ బాబు దగ్గర కూడా కొంత కాలం డోలు వాయిద్యంలో తాళాలు నేర్చుకున్నారు. డోలు వాయిద్యంలో 108 తాళాలుంటే, వాటిలో 35 తాళాలు అప్పట్లోనే నేర్చుకుని, మిగిలిన తాళాలు పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నారు.



తల్లి, తండ్రి కుటుంబ సభ్యులతో కలసి కచేరీ చేస్తూ...



తెలంగాణ రాజ్‌భవన్‌లో పూర్వ గవర్నర్ తమిళిసై నుంచి సత్కారం అందుకుంటున్న మనీషా

పురస్కారాలు... ప్రశంసలు

మనీషా డోలు వాయిద్య విద్యలో పీజీ చేయక ముందు నుంచే అనేక కచేరీలు చేశారు. చిన్నతనంలోనే ఎందరో ప్రముఖుల మన్ననలు పొందారు. తన డోలు ప్రావీణ్యానికి మెచ్చిన న్యూ లైఫ్ సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందించింది. 2019లో సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన ఇంటర్నేషనల్ మథర్ తెరీసా గోల్డ్‌మెడల్ అవార్డ్ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ చూపి గోల్డ్ మెడల్‌ను సాధించారు. సిలికానాంధ్ర ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించిన నాదశ్వర డోలు వాయిద్యం ప్రదర్శనలో గిన్నిస్ రికార్డును సొంతం చేసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, తమిళనాడు పూర్వ గవర్నర్ తమిళిసై వంటి ప్రముఖుల చేతులు మీదగా పురస్కారాలు, సత్కారాలు అందుకున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రాలైన శ్రీశైలం, భద్రాచలం, కాశీ, పూరి, హరిద్వార్, ద్వారకలో జరిగిన కార్యక్రమాల్లోనూ ప్రతిభ చూపారు. యువతకు ఆదర్శంగానిలిచారు.

ఓటర్లుగా అర్హులైన పట్టభద్రులు

- 80 శాతం పట్టభద్రుల దరఖాస్తులు పరిష్కారం
- నేటి సాయంత్రానికి ముసాయిదా ఓటరు జాబితా
- 23న ప్రచురణకు చర్యలు
- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టరు



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన కలెక్టర్ నాగలక్ష్మి, డీఆర్‌వో కాజావలి

గుంటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి సభ్యుని ఎన్నికకు అర్హులైన పట్టభద్రులను ఓటరుగా నమోదు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని గుంటూరుజిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులకు సూచిం చారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్లో ఓటర్ల నమోదు ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఓటరు నమోదు నోటిఫికేషన్ ప్రకారం సెప్టెంబరు 30 నుంచి నవంబరు 6వ తేదీ వరకు పట్టభద్రుల శాసనమండలి ఓటుకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను ముసాయిదా ఓటరు జాబితాలో చేర్చి నవంబరు 20న ముద్రించి 23న ప్రచురి స్తారన్నారు. ఇప్పటి వరకు 2,83,100 మంది ఆన్‌లైన్ ద్వారా ఓటుకు దరఖాస్తు చేసుకోవడం జరిగిందని, ఆఫ్‌లైన్‌లో 48,900 మంది కలిపి మొత్తం 3 లక్షల 32 వేల మంది దరఖాస్తు చేస్తుకున్నారన్నారు. ఇందులో 80 శాతం దరఖాస్తులను ఇప్పటికే పరిష్కరించామని, మిగిలిన 20 శాతం దరఖాస్తులను బుధవారం సాయంత్రానికి పూర్తి చేసి డ్రాఫ్ట్ ఓటరు జాబితా ముద్రణ కోసం పంపుతామన్నారు. నవంబరు 23వ తేదీ నుంచి డిసెంబరు 9వ తేది వరకు ముసా యిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి, డిసెంబర్ 25వ తేదీ నాటికి పరిష్కరించి, ఆ నెల 30న తుది ఓటరు జాబితా ప్రచురించడం జరుగుతుందని కలెక్టర్ తెలియజేశారు.

2019 ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల నియోజకవర్గ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలలో 2,48,799 మంది ఓటర్లకు గాను 362 పోలింగ్ కేంద్రాలను వినియోగించడం జరిగిందని, 2025 ఎన్నికలకు 3 లక్షల 32 వేల మంది ఓటర్లకు ఆరు జిల్లాల్లో 421 పోలింగ్ స్టేషన్లు ప్రతిపాదించామన్నారు. అయితే తుది ఓటర్ల జాబితా ప్రచురితమయ్యే నాటికి పోలింగ్ కేంద్రాల సంఖ్యలో మార్పులు జరగొచ్చన్నారు. ఒక్కొక్క పోలింగ్ కేంద్రంలో 900 మంది ఓటర్లు ఓటు వేసే అవకాశం వుందన్నారు.

సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, డాక్టర్ టి సేవాకు మార్ (ఏఏపీ), చిరుతనగండ్ల వాసు(బీఎస్‌పీ), బీ పాండురంగ విఠల్(బీజేపీ), వై కృష్ణకాంత్(సీపీఎం),బీ.సునీల్ కుమార్(కాంగ్రెస్), కంచర్ల శివరామయ్య (టీడీపీ),ఏఈఆర్వోలు, ఎలక్షన్‌సెల్ సూపరింటెండెంట్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో శబరిమల యాత్రకు వెళ్లే యాత్రీకుల సౌకర్యార్థం ఏటా రైల్వే శాఖ నడిపే ప్రత్యేక రైళ్లకు సంబంధించి ఈ ఏడాది ప్రకటన విడుదలైంది. నంబరు. 07145 మచిలీపట్నం - కొల్లం ప్రత్యేక రైలు ఈ నెల 25, డిసెంబరు 2, 9, 16 తేదీల్లో సాయంత్రం 6 గంటలకు న్యూగుంటూరు రైల్వేస్టేషన్‌కు వచ్చి 6.02కి బయలుదేరుతుంది. నెంబరు. 07146 కొల్లం - మచిలీపట్నం ప్రత్యేక రైలు ఈ నెల 27, డిసెంబరు 4, 11, 18 తేదీల్లో (బుధవారం) వేకువజామునకు ముందు 2.30కి బయలుదేరి గురువారం వేకువజామునకు ముందు 2.50కి న్యూగుంటూరుకు వస్తుంది.


ఈ రైళ్లకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో తెనాలి, బాపట్ల, చీరాలలో నిలుపుదల సౌకర్యం కల్పించారు. ఈ నెల 22, 30 తేదీల్లో నవంబరు. 07147 మచిలీపట్నం - కొల్లాంస్పెషల్ మధ్యాహ్నం 3.15కి గుంటూరు, సాయంత్రం 4 గంటలకు నరసరావుపేట, 4.45కి వినుకొండ, మరుసటి రోజు రాత్రి 9.20కి కొల్లాం చేరుకొంటుంది. నంబరు. 07148 కొల్లాం - మచిలీపట్నం స్పెషల్ ఈ నెల 25, డిసెంబరు 1 తేదీల్లో(బుధవారం) వేకువజామునకు ముందు 2.30కి బయలుదేరి గురువారం ఉదయం 6.08కి వినుకొండ, 6.38కి నరసరావుపేట, 8 గంటలకు గుంటూరుకు చేరుకొంటుందని డీఆర్‌ఎం ఎం రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పేరేచర్ల లేఅవుట్‌లో విద్యుత్ తీగల చోరీ

- నిర్మాణాలు నామమాత్రమే.. ● లైన్లు, ట్రాన్స్‌పార్మర్ల ఏర్పాటు
- ఇదే అదనుగా చెలరేగిపోతున్న విద్యుత్ తీగెల చోరీ ముఠా



పేరేచర్ల లేఅవుట్‌లో వేసిన విద్యుత్ స్తంభాలు, వరుసగా అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్లు



మేడికొండూరు అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని పేదల కోసమంటూ మేడికొండూరు మండలంలోని పేరేచర్లలో ఏర్పాటు చేసి లేఅవుట్‌లో విద్యుత్ తీగెల(కండక్టర్)ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేస్తున్నారు. లేఅవుట్‌లో 18 వేల ప్లాట్లను పేదలకు కేటాయించినా గృహ నిర్మాణాలు నామ మాత్రంగానే జరిగాయి. అయినా విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌పార్మర్ల ఏర్పాటు చేశారు. ఇదే అదనుగా విద్యుత్ తీగెలు చోరీ చేసే ముఠా చెలరేగిపోతున్నది. రోడ్ల నిర్మానాలు పూర్తి కాకపోయినా కేవలం హద్దు రాళ్ల ఆధారంగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసి ట్రాన్స్‌పార్మర్లను బిగించారు. భారీ సబ్ స్టేషన్ నిర్మాణం కూడా జరిగిపోయింది. ఈ సబ్ స్టేషన్‌కు విద్యుత్ సరఫరాకు కిలో మీటర్ల పొడవున విద్యుత్ వైర్లను వేశారు. అక్కడ ఇళ్లు నిర్మాణాలు జరగకపోవడంతో జన సంచారం అంతగా లేదు. దీంతో విద్యుత్ తీగెల చోరీ ముఠాను అడ్డుకునే వారే లేకుండా పోయారు. ఇప్పటి వరకు సుమారు 4 కిలో మీటర్ల పొడవున లక్షల విలువైన కండక్టర్ వైరు చోరీ జరిగిందని అధికారులు చెబుతున్నారు. విద్యుత్ సరఫరా అవుతున్నా లైన్లలో కండక్టర్ దొంగలించాలి అంటే సాధారణ వ్యక్తులు సాహసించరని, విద్యుత్ లైన్ల గురించి పూర్తిగా తెలిసిన వ్యక్తులే చోరీకి పాల్పడుతుంటారని విద్యుత్ అధికారులు అంటున్నారు. ఎటునుంచి విద్యుత్ సరఫరా అవుతున్నది, ఎక్కడ సరఫరా నిలిపి వేయాలి, స్తంభాలపై ఉన్న వైరును కిందకు ఎలా దింపాలో పూర్తిగా తెలిసిన వ్యక్తులు ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నట్లు అధికారులు భావిస్తున్నారు. దీనిపై విద్యుత్ శాఖ అధికారులు మేడికొండూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదుపై పోలీసులు ఆసక్తి చూపడం లేదు. లైన్లలో విద్యుత్ ఉండగా ఎలా చోరి జరుగుతుందని వారు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో చోరీ జరిగినా అప్పట్లో పోలీసులు ఫిర్యాదు స్వీకరించలేదు. తాజాగా డోకిపర్రు ఏఈ ఇచ్చిన ఫిర్యాదును తీసుకున్నారు. దీనిపై ఏ మేరకు చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

అంతర్రాష్ట్ర బియ్యం సరఫరా

ముఠా అరెస్టు

- ట్రాన్స్‌పోర్ట్ వాహనంలో సరిహద్దు దాటిస్తున్న వైనం
- అక్టోబరులో జరిగిన ప్రమాదంలో ముఠా గుట్టురట్టు



రేషన్ బియ్యం దందా వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు, చిత్రంలో ముగ్గురు నిందితులు

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని వాహనంలో అర్ధరాత్రి రాష్ట్ర సరిహద్దు దాటించి దందాకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. మిర్యాలగూడ పట్టణంలోని తన కార్యాలయంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు కేసు వివరాలు మంగళవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లి గ్రామానికి చెందిన మందపాటి నర్సింహారావు, అదే గ్రామానికి చెందిన కల్లూరి లింగయ్య రేషన్ బియ్యం దందా చేస్తుంటారు. వారి కదలికపై పోలీసులు రెండు నెలలుగా నిఘా ఉంచి వాడపల్లి వద్ద మంగళవారం అరెస్టు చేశారు. దామరచర్ల మండలం బడావత్‌తండాకు చెందిన బడావత్ సర్దార్, మినీ ట్రాన్స్‌పోర్టు వాహన డ్రైవర్ దేవరకొండ అమరయ్య, హమాలీ ముఠామేస్త్రీ సైదారావుతో కలిసి బియ్యం దందా కొనసాగిస్తున్నారు. దామరచర్ల, అడవిదేవులపల్లి, మిర్యాలగూడ మండలాల పరిసర ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులనుంచి రేషన్ బియ్యాన్ని కిలోకు రూ.10కి చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ప్రతినెల గ్రామాల్లో తిరిగి సేకరించిన బియ్యాన్ని ఏపీ 39యూఎఫ్ 8418నెంబర్‌గల అశోక్‌లేల్యాండ్ మినీగూడ్స్ వాహనం ద్వారా రాష్ట్ర సరిహద్దు దాటించేవారు. ఆ వాహనంలో రేషన్ బియ్యాన్ని రవాణా చేస్తున్న క్రమంలో అక్టోబరు 24వ తేదీన దామరచర్ల గ్రామశివారులోని నర్సాపురం ఎక్స్‌రోడ్డు వద్ద బోల్తాపడింది. ఈ ప్రమాదంలో హమాలీ కూలీ షేక్ నాగులు మృతిచెందగా, మరికొంతమందికి గాయపడ్డారు. వాడపల్లి పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకొని డ్రైవర్ అమరయ్యను అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో రేషన్ బియ్యం రవాణా దందా వెలుగులోకి వచ్చి, నిందితుల వివరాలు బయటపడినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులు ఏపీ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన నర్సింహారావు, లింగయ్యను అరెస్టు చేసి రెండు సెల్‌ఫోన్లు రికవరీ చేశారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులపై వాడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎనిమిది క్రిమినల్ కేసులు ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ దందాలో స్థానికంగా మరికొందరి పాత్ర ఉన్నట్లు విచారణలో తేలిందని, నిందితుల ఫోన్ కాల్ రికార్డు ఆధారంగా సూత్ర, పాత్రదారులను గుర్తించి త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.

మరో బియ్యం వ్యాపారిని అరెస్ట్..

నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండల కేంద్రంగా రేషన్‌బియ్యం రవాణాకు పాల్పడుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా రెంటచింతలకు చెందిన ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. రెంటచింతల గ్రామానికి చెందిన బియ్యం వ్యాపారి తిప్పబత్తుల వెంకటనారాయణ అలియాస్ నారాయణ నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలం బాల్నేపల్లి గ్రామానికి చెందిన రమావత్ కోటేశ్వర్‌రావు, రమావత్ ధనమూర్తిఓ కలిసి రేషన్‌బియ్యాన్ని అర్ధరాత్రి రాష్ట్ర సరిహద్దు దాటిస్తుంటారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం బాల్నేపల్లి గ్రామశివారులో శిథిలావస్థలో ఉన్న ఓ ఇంట్లో నిల్వచేసిన సుమారు నాలుగు క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని విచారణ చేపట్టగా బియ్యాన్ని రమావత్ కోటేశ్వర్‌రావు, రమావత్ ధనమూర్తి సేకరించి డంప్ చేసినట్లు తేలిందన్నారు. వ్యాపారి వెంకటనారాయణ స్థానికంగా ఏర్పాటు చేసుకున్న ముఠాసభ్యులతో రేషన్‌బియ్యాన్ని సేకరించి ఏపీకి చెందిన అంగోతు రాంబాబు, పెంటబోయిన సైదారావుల సహకారంతో ఏపీకి తరలిస్తున్నట్లు విచారణలో తేలిందని డీఎస్పీ తెలిపారు. పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్న బియ్యం వ్యాపారి వెంకటనారాయణను అడవిదేవులపల్లి వద్ద అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ రెండు కేసుల్లో ప్రధాన నిందితులకు సహకరించిన వ్యక్తులను గతంలో అరెస్టు చేసి రిమాండ్ చేశామన్నారు. రేషన్‌బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఏపీ రాష్ట్రానికి చెందిన ముగ్గురు ప్రధాన నిందితులను చాకచక్యంగా పట్టుకున్న రూరల్ సీఐ వీరబాబు, వాడపల్లి, అడవిదేవులపల్లి ఎస్ఐలు హరికృష్ణ, శేఖర్‌లను డీఎస్పీ అభినందించారు.

అభాగ్యులకు.. ఆసరా

- మిషన్ వాత్సల్యలో 318 మందికి లబ్ధి
- రెండో విడత లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు
- దరఖాస్తులతో సరిపెట్టిన గత వైసీపీ పాలకులు



(బాపట్ల, ఆంధ్రజ్యోతి) కరోనా మహమ్మారిలో తల్లిదండ్రులు కోల్పోయి అనాథలుగా మారిన వారు కొందరైతే, తల్లిదండ్రుల్లో ఒకరిని కోల్పోయి అభాగ్యులుగా మారిన వారు మరికొందరు. వీరే కాక రకరకాల కారణాలతో అనాథలుగా బతికేవారు, హెచ్ఐవీ బాధితుల పిల్లలు ఇలాంటి వారందరినీ అక్కున చేర్చుకుని అండగా ఉండాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 2022లో మిషన్ వాత్సల్య పథకానికి శ్రీకారం చుట్టాయి. అయితే కేంద్రం మిషన్ వాత్సల్య పథకానికి రూపకల్పన చేసినా వైసీపీ పాలకులు చిన్నారులకు సాయం అందించే బాధ్యతను మరిచారు. ప్రభుత్వ ప్రాథామ్యాలలో ఒకటిగా ఉండాల్సిన ఈ పథకాన్ని నీరుగార్చారు. మొక్కుబడిగా దరఖాస్తుల స్వీకరణతో సరిపెట్టిందే తప్ప పిల్లల బాగోగులు చూడడంలో పూర్తిగా విఫలమైంది. సంరక్షకుల నీడలో ఉండే చిన్నారులు ఆ డబ్బులు కోసం కళ్లు కాయాలు కాచేలా ఎదురుచూసినా, కార్యాలయాల చుట్టూ తిరిగినా గత పాలకులు మనసు కరగలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఆయా దరఖాస్తులపై దృష్టి సారించింది. తొలివిడతలో జిల్లాలో మొత్తం 490 దరఖాస్తులు వచ్చినట్లు తేల్చారు. క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా 318 మంది అంతిమంగా ఆ పథకానికి అర్హులుగా తేలారు. జాబితా కేంద్రానికి పంపడం, వెంటనే నిధులు మంజూరు చేయించింది. 318 మంది చిన్నారుల సంరక్షకుల ఖాతాల్లో 78 లక్షల నగదును ఈ ఏడాది సెప్టెంబరు 3నే జమ చేసినట్లు ఐసీడీఎస్ విభాగం తెలిపింది. ఇందులో అనాథలు 61 మంది ఉండగా, కొవిడ్ వల్ల అభాగ్యులుగా మిగిలినవారు 80 మంది, హెచ్ఐవీ ఎఫెక్టెడ్ 27, తల్లి లేదా తండ్రిలో ఒకరిని కోల్పోయిన చిన్నారులు 150 మందికి మిషన్ వాత్సల్య పథకం కింద నగదును జమ చేసింది.


ఆరు నెలలకు ఒకేసారి...

వాస్తవానికి మిషన్ వాత్సల్య పథకం తాలూక నగదు గతేడాది అక్టోబరులోనే లబ్ధిదారులకు అందాల్సి ఉంది. కానీ వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా ఇది పేపర్లకే పరిమితమైంది తప్ప అమలుకు నోచుకోలేదు. నెలకు రూ.4,000 చొప్పున గతేడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు అంటే ఒకేసారి ఆరు నెలలకు సంబంధించి నగదును ఒకేసారి చిన్నారుల సంరక్షకుల ఖాతాల్లో జమ అవడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రెండో విడత లబ్ధిదారుల ఎంపిక కూడా వేగవంతంగా జరుగుతుంది. ఇది 2024-25కు సంబంధించిన ప్రక్రియగా అధికారులు చెబుతున్నారు. నిధుల లభ్యత దృష్ట్యా కేవలం 25 మందికే ఈ దఫాలో అవకాశం కల్పించడానికి వీలుందని ఐసీడీఎస్ విభాగం చెబుతోంది. వీటికి సంబంధించి దరఖాస్తుల స్వీకరణ గడువు కూడా అక్టోబరు 25తో ముగిసింది. మొత్తం 70 దరఖాస్తులు వచ్చాయని, క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి వీరిలో 25 మందిని ఎంపిక చేయడానికి కసరత్తు జరుగుతుందని అధికారులు చెబుతున్నారు

పథకానికి అర్హతలివే

2025 మార్చి 31కి 18 ఏళ్ల వయసులోపునే ఉండాలి. తల్లిదండ్రులు ఇద్దరినీ కోల్పోయిన వారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న దంపతుల పిల్లలు, సదరు కుటుంబం వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో అయితే రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.96 వేలకు మించనివారై ఉండాలి. ఎవరైతే నిరాదరణకు గురవుతున్న పిల్లలున్నారో వారు తప్పనిసరిగా ప్రభుత్వ స్కూల్‌లోనే విద్యనభ్యసిస్తూ ఉండాలి.

పారదర్శకంగా దరఖాస్తుల పరిశీలన



ఇప్పటికే ఖాతాల్లో నగదు జమైన లబ్ధిదారుల ఎంపికను కూడా పూర్తి పారదర్శకంగా నిర్వహించాం. జిల్లాలోని 9 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో రెండో విడతలో దరఖాస్తులు స్వీకరించాం. వాటిని నిబంధనల ప్రకారం పరిశీలించి తుది జాబితా ప్రకారం వారికి మిషన్ వాత్సల్య పథకం అందేలా చూస్తాం.

- కే.ఉమ, ఐసీడీఎస్ పీడీ

కార్పొరేషన్లకు సభ్యుల నియామకం

గుంటూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో నాలుగు కార్పొరేషన్లకు సభ్యులను నియమించగా, ఉమ్మడి గుంటూరుకు చెందిన పలువురు స్థానం సంపాదించుకున్నారు. యాదవ కార్పొరేషన్లో మంగళగిరి నియోజకవర్గం నుంచి టీడీపీ నేత తాడిబోయిన భాస్కరరావు, గౌడ కార్పొరేషన్లో చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి టీడీపీ నేత కందుల వెంకట రమణ, గుంటూరు తూర్పు నియోజకవర్గం నుంచచి లక్ష్మీశైలజ గౌడ్, మాల కార్పొరేషన్లో పొన్నూరు నియోజకవర్గం నుంచి టీడీపీ నేత బండ్లమూడి బాబూరావులు సభ్యులుగా నియమితులయ్యారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

ఆధార్ క్యాంపు పరిశీలన

మేడికొండూరు నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలం పేరేచర్ల జడ్పీ హైస్కూల్లో ఆధార్ క్యాంపుని ఎంపీడీవో మేడికొండూరు తోట చందన మంగళవారం సందర్శించారు. సుమారు 50 నవీకరణలు, ఎన్‌రోల్‌మెంట్‌లు జరిగాయని, బుధవారం కూడా పేరేచర్లలో ఆధార్ క్యాంపు కొనసాగుతుందని, అన్ని రకాల ఆధార్ అప్‌డేషన్‌లను ఈ క్యాంపుల్లో చేయించుకోవచ్చని ప్రజలకు వివరించారు.

పశ్చిమడెల్టాకాల్వకు

4247 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల , నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకాల్వకు 4247 క్యూసెక్కుల సాగునీటిని మంగళవారం విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజివద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉంది. కాగా దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్‌ఛానల్‌కు 216 క్యూసెక్కులనీరు, రేపల్లెకాల్వకు 625 క్యూసెక్కుల నీరు, తూర్పుకాల్వకు 52 క్యూసెక్కులనీరు, పశ్చిమకాల్వకు 92 క్యూసెక్కులనీరు, నిజాంపట్నంకాల్వకు 225 క్యూసెక్కులనీరు, కొమ్మమూరుకాల్వకు 2400 క్యూసెక్కులనీరు, విడుదల చేస్తున్నారు.

డిసెంబరు 15లోగా

పంటబీమా చెల్లించాలి

దుగ్గిరాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్ బీమాయోజన, వాతావరణ ఆధారిత పంట బీమా పథకం ద్వారా రైతుల నమోదు ప్రక్రియ ప్రారంభమైనందున 2024-2025 సంవత్సరానికి పంట బీమా డిసెంబరు 15లోగా చెల్లించాలని ఏఈ పీ.శిరీష తెలిపారు. మొక్కజొన్నకు ఎకరాకు రూ.114, జొన్నకు రూ.48, మినుము రూ.50, పెసర రూ.45, పప్పుసెనగకు రూ.70 చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆధార్‌కార్డు, సీసీఆర్‌సీ కార్డు, సాగువిస్తీర్ణ ధ్రువీకరణ పత్రం, బ్యాంకుఖాతా వివరాలు రైతులు కామన్‌సర్వీస్ సెంటర్‌లో అందించి తగు రసీదు తీసుకోవాలని కోరారు.

పారిశుధ్య పనుల పరిశీలన

మంగళగిరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి నగరంలో పారిశుధ్య నిర్వహణ తీరును పురపాలక శాఖ గుంటూరు ప్రాంతీయ సంచాలకులు ఎస్.హరికృష్ణ మంగళవారం ఉదయం పరిశీలించారు. ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషాతో కలిసి వార్డుల్లో పర్యటించారు. డోర్ టు డోర్ చెత్త సేకరణ, ఆర్బీఎంఎస్ స్కానర్ల పనితీరును పర్యవేక్షించారు. ప్రతిరోజు పారిశుధ్య సిబ్బంది వస్తున్నారో లేదో స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికీ చెత్త సేకరణ వంద శాతం జరిగేలా చూడాలని ఆదేశించారు. ప్రజలు సమస్యలేమైనా వుంటే ఎంటీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కార చర్యలను చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల

రాష్ట్ర సదస్సుకు తరలండి

ఫిరంగిపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో నవంబరు 20వ తేదీన ఉదయం 11 గంటలకు మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో జరిగే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల రాష్ట్ర సదస్సుకు తరలి రావాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం భాగ్యారావు కోరారు. మంగళవారం ఫిరంగిపురంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సదస్సుకు ఆంధ్రప్రదేశ్ ఎంఎస్‌ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీ శివ శంకర్, ఏపీ పారిశ్రామిక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డీ ప్రభాకర్, డీబీఎఫ్ జాతీయ అధ్యక్షుడు కొరివి వినయ్ కుమార్, కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ళ సుబ్రహ్మణ్యం, డిక్కీ సంస్థ రాష్ట్ర సమన్వయ కర్త రాజమణి, కొసనం రాము పాల్గొంటారని తెలిపారు.

ఆధార్ క్యాంపులు...

మేడికొండూరు నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలం పేరేచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆధార్ శిబిరాన్ని ఎంపీడీఓ మేడికొండూరు తోట చందన మంగళవారం సందర్శించారు. శిబిరంలో సుమారు 50 నవీకరణలు, ఎన్‌రోల్‌మెంట్‌లు జరిగాయి. బుధవారం కూడా పేరేచర్లలో ఆధార్ క్యాంపు కొనసాగుతుందని, చిరునామా, మొబైల్ అప్‌డేషన్, బాల అధార్ అప్‌డేషన్ మరియు అనేక ఇతరసేవలు అధార్ క్యాంపులో అందుబాటులో ఉంటాయని తెలిపారు. శిబిరంలో డిజిటల్ అసిస్టెంట్ కుర్ర భరత్, సారా తదితరులు పాల్గొన్నారు.

ఆహార సలహా సంఘాలు ఎక్కడ ?

● సమీక్షలు నిర్వహించని అధికారులు
● ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలు
● రెండు ఏళ్ల నుంచి కమిటీలకు మంగళం


తాడికొండలోని తహసీల్దారు కార్యాలయం

తాడికొండ నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాల నాణ్యత, ధరల నియంత్రణ వంటి విషయాల్లో ప్రజలకు సేవలందించాల్సిన ఆహార సలహా సంఘాలు మచ్చుకైనా కన్పించటం లేదు. దీంతో ఆహార పదార్థాల్లో నాణ్యత లోపించడంతోపాటు ధరలు ఆకాశాన్నంటుకుంటున్నాయి. జిల్లా, డిజిజన్, మండలస్థాయిలో ఈ కమిటీలు ఉండాలి. జిల్లా స్థాయి సలహా సంఘాల కమిటీని కలెక్టర్లు లీడ్ చేస్తుంటారు. ఈ కమిటీలో కలెక్టర్‌తోపాటు జిల్లా ఉన్నాతాధికారుల, ప్రజా ప్రతినిధులు ఉంటారు. అలాగే మండల స్థాయి అయితే తహసీల్దార్, ప్రజా ప్రతినిధులు, రేషన్ డీలర్లు, ప్రజా సంఘాలు కమిటీలో ఉంటారు. ప్రతి మండలానికి ఉన్న కమిటీని తహసీల్దారు లీడ్ చేస్తుంటారు. వీరిని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే ఉత్తర్వులను అనుసరించి జిల్లా పౌరసరఫరా శాఖ నియమనిబంధనల మేరకు మండల స్థాయి కమిటీలుగా ఎంపిక చేస్తారు.

తూతూ మంత్రంగా సమావేశాలు

గత ప్రభుత్వ హయంలో మండల స్థాయిలో ఆహార సలహా సంఘాలు కనిపించకుండా పోయాయి. రెండు సంవత్సరాలు నుంచి ఒక్క సామావేశం కూడా జరగలేదు. అంతకముందు సమావేశాలు నిర్వహించ మన్న పేరుకు తూతూమంత్రంగా కానిచ్చేవారు. వాస్త వానికి మూడు నెలలకోసారి మండల స్థాయి కమిటీ సమీక్షల్లో తీసుకున్న నిర్ణయాలను డివిజన్ స్థాయి కమిటీకి తెలపాలి. డివిజన్ సంఘాలు జిల్లా కమిటీలకు నివేదికను పంపించాల్సి ఉంటుంది. అయితే అధికారులు అన్ని స్థాయిల్లో కంటితుడుపు చర్యలుగా సమావేశాలను నిర్వహించే వారు. కూటమి ప్రభుత్వంలోనైనా ఆయా సంఘాలను సమర్థవంతంగా నిర్వహించాలని వివిధ పార్టీ నాయకులు, ప్రజా సంఘాలు కోరుకుంటున్నాయి.

అధికారులు పర్యవేక్షణ చేయాలి



అధికారులు పర్యవేక్షణ లేకపోవటంతో ఎరువులు, ఆహార పదార్థలు ఎమ్మార్పీ ధరకు విక్రయించాల్సి ఉన్నా వ్యాపారులు ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నారు. దుకాణాల్లో సరుకుల నాణ్యతలను కూడా పరిశీలించాల్సి ఉంది. కల్తీ సరుకులపై అధికారులు దృష్టిపెట్టాల్సి ఉంది. ఆహారసలహా సంఘాల సమావేశాలను ఏప్పటికప్పుడు అధికారులు నిర్వహించాలి. వినియోగదారులకు అందుబాటులోకి ధరలు వచ్చేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

చింతల భాస్కరరావు,
ఆహార సలహాసంఘం కమిటీ సభ్యులు, తాడికొండ

సలహా సంఘాల విధులు..

కమిటీ సభ్యుల దృష్టికి వచ్చిన ఆహారం పదార్థాల శుభ్రత, నాణ్యత, ధరల నియంత్రణ లేకపోవడం, అధిక ధరలకు విక్రయించడం, వంటి వాటిని ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్లాలి. ఈ నివేదికలు జిల్లా అధికారులకు అందగానే సరైన నిర్ణయం తీసుకుని అమలు చేయడం, ధరల నియంత్రణ అడ్డుకట్టవేయడం వంటివి చేయాలి. ఈ ఆహార సలహా సంఘాలు వైఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి కొనసాగాయి. అనంతరం టీడీపీ ప్రభుత్వమూ వాటిని కొసాగించింది. కానీ వైసీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక సలహా సంఘాల ఊసేలేకుండా పోయింది.


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ వెంకటస్వామి, ఏవో కిరణ్మయి

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కాకుమాను, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కాకుమాను రైతు సేవా కేంద్రాలలో మంగళవారం తహసీల్దార్ వెంకటస్వామి, ఏవో కిరణ్మయిలతో కలసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిచారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటస్వామి మాట్లాడుతూ సచివాలయ, రైతు సేవా కేంద్రాలలో పని చేసే సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. కాకుమాను మండలంలో వరి సాగు అవుతున్న ప్రతి గ్రామంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరుగుతుందన్నారు. పొన్నూరు సబ్‌డివిజన్ ఏడీఏ రామకోటేశ్వరి మాట్లాడుతూ వరి రైతుల ప్రయోజనాల కోసమే మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. సాధారణ రకం క్వింటా రూ.2300, 75 కేజీల బస్తా రూ 1725, ఏ గ్రేడ్ రూ.1740గా ప్రభుత్వం మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. తేమ శాతం 17కి మంచి ఉండకూడదన్నారు. కార్యక్రమంలో వీఏఏ శ్వేత కృష్ణప్రియ, సీహెచ్ అంజలి, షణ్ముఖ క్షేత్రపాల్ రైతులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలను తిరస్కరించండి

దుగ్గిరాల, నవంబరు 19: కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను తిరస్కరించాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. దుగ్గిరాల ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం జెట్టి బాలరాజు అధ్యక్షతన వ్యవసాయకార్మిక సంఘ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. శివశంకర్ మాట్లాడుతూ గతంలో ఢిల్లీ పోరాటం జరిగిన సందర్భంగా మోదీప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు.గతేడాది ధాన్యం బస్తా రూ.1800 ఉండగా ఈఏడాది రూ.1400కు కూడా కొనడంలేదన్నారు. కేంద్రప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2320 ప్రకటించిందని, 75కిలోల బస్తా రూ. 1740ల చొప్పున కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కిసాన్‌మోర్చా పిలుపుమేరకు 26వ తేదీ గుంటూరులో నిర్వహించే ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వై. బ్రహ్మేశ్వరరావు, ఎస్. యోగేశ్వరరావు, మన్నవ నాగమల్లేశ్వరరావు, పాములు పాల్గొన్నారు.

నరేంద్రకుమార్‌కు మంత్రి పదవి ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కాకుమాను, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో సీనియర్ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌కు మంత్రి పదవి ఇవ్వాలని పొన్నూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, కాకుమాను మండల మాజీ ఎంపీపీ మామిళ్లపల్లి రాంగోపాల్ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2004లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో జయకేతనం ఎగరవేసిన ఒకేఒక్కడుగా అభివర్ణించారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో చంద్రబాబుకు కుడి భుజంగా ఉంటూ మాజీ సీఎం రాజశేఖరరెడ్డి పై అలుపెరగని పోరాటం చేసిన సంఘటనలను మననం చేసుకున్నారు. అటువంటి పోరాటయోధుడు 1994 నుంచి 2024 వరకు 2019 మినహా ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అసెంబ్లీ టైగర్ నరేంద్రకు మంత్రి పదవి వచ్చేది ఎప్పుడని అధిష్టానాన్ని ప్రశ్నించారు. 2021 లో ఏసీబీ అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేసి గత వైసీపీ ప్రభుత్వం వేధింపులకు గురి చేసిన వెన్ను చూపని యోధుడు ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌ను పార్టీ ఉన్నత పదవి కట్టబెట్టి ఈ ప్రాంత టీడీపీ అభిమానుల ఆశయాలను, ఆకాంక్షలన గౌరవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు నల్లమోతు పూర్ణచంద్రరావు, బోడపాటి ప్రసాద్, సంపత్‌బాబు, లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, మల్లేశ్వరరావు, పాల్గొన్నారు.

చలపతి ఫార్మసీలో చెస్‌పోటీలు

తాడికొండ,నవంబరు19(ఆంధ్రజ్యోతి): లాం చలపతి ఫార్మసీ కళాశాలలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల చదరంగం పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే ఈపోటీల్లో పురుషులు, మహిళలు పాల్గొంటారన్నారు. మొదటి రోజు పోటీల్లో 16 టీమ్‌లు పాల్గొన్నాయని తెలిపారు. బుధవారం ఫైనల్స్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు నిర్ణయిస్తారన్నారు. అంతే కాకుండా విశ్వవిద్యాలయం పురుషులు, మహిళల జట్ల ఎంపిక పక్రియ జరుగుతుందన్నారు.

నల్లమాస్కులు ధరించి నిరసన

తాడేపల్లి టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): న్యాయంగా తమకు రావాల్సిన నష్టపరిహారాన్ని చెల్లించాలని కోరుతూ ఏసీసీ సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులు మంగళవాం దీక్షా శిబిరంలో ముఖానికి నల్ల మాస్కులు ధరించి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ మంత్రి నారా లోకేశ్ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం యాజమాన్యాన్ని చర్చలకు కూర్చోపెట్టి కార్మికులకు న్యాయం చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. నిరసనలో వివిధ ట్రేడ్ యూనియన్‌ల నేతలు కే.ఆదినారాయణ, కూరపాటి స్టీవెన్, ఎం గురవయ్య, బాషా, మాణిక్యాలరావు, నాగేశ్వరరావు, సామ్రాజ్యం, నరసింహారావు, దుర్గారావు, అంకయ్య, నవనీతం సారమ్మ, దుర్గమ్మ రమాదేవి, హిమాంబి, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీకి రావడానికి భయమెందుకు జగన్?

తాడేపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): 'అసెంబ్లీకి రావడానికి ఎందుకు భయపడుతున్నావు జగన్' అంటూ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ ప్రశ్నించారు. మంగళవారం తాడేపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో జరిగిన అవినీతి అక్రమాలపై అసెంబ్లీలో వచ్చే ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి ముఖం చెల్లకే జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీ సమావేశలకు డుమ్మా కొట్టారని విమర్శించారు. అసెంబ్లీలో సంఖ్యా బలం లేకున్నా ప్రతిపక్ష హోదా కావాలని చాక్లెట్ కావాలంటూ చిన్న పిల్లాడిలా జగన్ మారాం చేయడం ఏమిటని ప్రశ్నించారు. జగన్ హయాంలో రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయన్నారు. ప్రజలను మాటలతో మభ్యపెట్టి నటించి రోజుకు కోట్లాది రూపాయలు వెనకేసుకున్న జగన్ నైజం ప్రజలకు తెలిసి కేవలం 11 సీట్లే ఇచ్చి ఆయనను లెవన్‌రెడ్డిగా మార్చారని ఎద్దేవా చేశారు. రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాన్‌లు ఎంతో కృషి చేస్తున్నారని రమేష్ కొనియాడారు.


లక్ష్మీనారాయణకు చెక్కును అందజేస్తున్న టీడీపీ నేతలు

సీఎం సహాయ నిధి అందజేత

మంగళగిరి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదవడ్లపూడి గ్రామానికి చెందిన చల్లపల్లి లక్ష్మీ నారాయణ అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చుల నిమిత్తం సాయం అందించాలని మంత్రి నారా లోకేశ్‌కు విన్నవించారు. తక్షణమే స్పందించిన మంత్రి లోకేశ్ సీఎం సహాయనిధి ద్వారా రూ.1,08,600లను విడుదల చేయించారు. ఈ ఎల్‌వోసీ చెక్కును టీడీపీ నేతలు మంగళవారం లక్ష్మీనారాయణకు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్‌చంద్, నేతలు రమేష్‌బాబు, ఆనంద్, సుధాకర్‌బాబు, ఏసుబాబు, రామకృష్ణ, కళాధర్, కంచర్ల బద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆపార్ నమోదుపై

అవగాహన పెంచుకోవాలి

కాకుమాను, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం తీసుకువచ్చిన ఏపీపీఏఆర్(ఆపార్) నమోదుపై ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలని మండల విద్యాశాఖాధికారి కే.ఎఫ్. కెన్నడీ అన్నారు. మండల కేంద్రమైన కాకుమాను శివారు ఇండియన్ జెమ్స్ ప్రైవేట్ పాఠశాలలో మంగళవారం సచివాలయ డీఏలు విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ కోసం చేపట్టిన ప్రక్రియను ఎంఈవో -2 విజయ్‌భాస్కర్‌తో కలసి పరిశీలించారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో పాల్గొని సమావేశపు అజెండాను వివరించారు. టీచ్ టూల్ అంశాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యం, శ్రీనివాస్, వీ రాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.


ఇందిరా గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించిన కాంగ్రెస్ పార్టీ నేతలు

పేదరిక నిర్మూలన కోసం ఇందిరా గాంధీ కృషి

మంగళగిరి సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో పేదరిక నిర్మూలన కోసం ఇందిరా గాంధీ ఎంతగానో కృషిచేశారని, అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేశారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ సలీం అన్నారు. భారత మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని మంగళగిరి పట్టణంలోని భార్గవపేట, మండలంలోని ఎర్రబాలెం గ్రామాల్లో కాంగ్రెస్ నేతలు ఆమె విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సలీం మాట్లాడుతూ ఇందిరా గాంధీ పేదల కోసం బ్యాంకుల జాతీయకరణ, జాతీయ ఆహార భద్రత, గరీబి హఠావో వంటి విప్లవాత్మకమైన నిర్ణయాలను అమలు చేశారన్నారు. ఇందిరా గాంధీని ఆదర్శంగా తీసుకుని రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రామనాథం పూర్ణచంద్రరావు, నేతలు రేమినిశెట్టి హనుమంతరావు, షేక్ సుల్తానా, దర్శనపు సామియేలు, షేక్ మున్నీ, బుల్లా సమర్పణకుమార్, పోలిశెట్టి సోమశేఖర్, బాబు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బాలుడి మృతదేహానికి పోస్టుమార్టం

● కుటుంభీకుల ఫిర్యాదుతో కేసు..
● ఖననం చేసిన ప్రదేశం నుంచి వెలికితీసి పోస్టుమార్టం

తాడికొండ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మిస్టరీగా మారిన తొమ్మిదో తరగతి విద్యార్థి సమీర్ మృతదేహానికి మంగళవారం పోస్టుమార్టం నిర్వహించారు. తాడికొండ సీఐ కే. వాసు తెలియజేసిన వివరాల ప్రకారం తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న షేక్ సమీర్ గత అక్టోబర్ 24వ తేదీన గ్రామంలోని నేలబావిలో పడి మృతి చెందాడు. సమీర్ మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించే క్రమంలో బాలుడు బంధువులు అడ్డుకొని పోస్టుమార్టం చేయటానికి నిరాకరించారు. తెల్లవారితో శుక్రవారం మంచిరోజు మృతదేహాన్ని దహన సంస్కారాలు చేసుకుంటామని పోలీసులకు ఫిర్యాదు ఇవ్వకుండానే బాలుడు సొంత గ్రామమైన అమరావతి మండలం కర్లపూడికి తరలించారు. దహన సంస్కారాలు పూర్తి చేశారు. అయితే బాలుడి శరీరంపై గాయాలు ఉన్నాయనే అనుమానంతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో విద్యాశాఖ అధికారులు పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. అంతేకాకుండా మంగళవారం రాత్రి బాలుడు నాయనమ్మ మస్తాన్‌బీ ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ క్రమంలో బాలుడు మృతదేహాన్ని బయటకు తీసి అమరావతి తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, సమక్షంలో ఫోరెన్సిక్ వైద్యులు పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తరువాత పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

తుళ్లూరు, నవంబరు 19: (ఆంధ్రజ్యోతి) తుళ్లూరులో రెండోరోజూ టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగింది. లైబ్రరి సెంటర్‌లో టీడీపీనేతలు సభ్యత్వ నమోదు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఫోన్‌లోనే సభ్యత్వం నమోదు చేసి వారి ఫోన్ వాట్సాప్ నంబరుకి గుర్తింపు కార్డును అక్కడిక్కడే పోస్టు చేశారు. టీడీపీ కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా టీడీపీ నేతలు పేర్కొన్నారు. సభ్యత్వం తీసుకున్నా వారికి అనేక ప్రయోజనాలు పొందుతరని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ టీడీపీ అధ్యక్షుడు కాటా అప్పారావు, తాడికొండ నియోజకవర్గ ఆర్టీఎస్ కోఆర్డినేటర్ నెలకుదిటి చందు, జమ్ముల హరి కిరణ్(బాబి), రాంబాబు పాల్గొన్నారు. ఒక్క రోజే 620 సభ్యత్వాలను నమోదు చేశారు.

విద్యార్థులకు అభినందన

మేడికొండూరు నవంబరు19(ఆంధ్రజ్యోతి): వీవీఐటీ కళాశాలలో ఈనెల 16న నిర్వహించిన బాలోత్సవ్ కార్యక్రమంలో ప్రతిభకనబరిచి బహుమతులు పొందిన ఇంటెల్ హైస్కూలు విద్యార్థులకు మంగళవారం ఆ స్కూల్లో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హైస్కూల్ డైరెక్టర్ కోనూరి అశోక్‌రాణి మాట్లాడుతూ కళలు విద్యార్థుల జీవితాల్లో నూతన ఆలోచనల్ని కలిగించడంతో పాటు వారి ఎదుగుదలకు ఎంతో దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జె.సుకన్య, పిడి ఎస్.కె రన్ను హసేన్ తదితరులు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

తుళ్లూరు, నవంబరు (ఆంధ్రజ్యోతి) అత్తింటి వారు హింసిస్తున్నారని ఓ వివాహిత మంగళవారం తుళ్లూరు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విజయవాడకు చెందిన మహమ్మద్ హిర్నాన్‌కు రాయపూడికి చెందిన ఎస్కే అమర్‌జాకు రెండేళ్ల క్రింతం వివాహమైంది. ఒక కుమారుడున్నాడు. అత్త, మామలు, భర్త హిర్నాన్ అదనపు కట్నంకోసం తనను అమర్‌జా ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

'మన మరుగుదొడ్డి- మన గౌరవం'

● పలు ప్రాంతాల్లో ప్రపంచ మరుగు దొడ్డి దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీలు


దుగ్గిరాలలో అధికారులు, ప్రజా ప్రతినిధుల ర్యాలీ

దుగ్గిరాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మరుగుదొడ్డి దినోత్సవ సందర్భంగా మంగళవారం మండల కేంద్రం దుగ్గిరాలలో పారిశుద్య కార్మికులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి అవగాహన ర్యాలీని నిర్వహించారు. డీపీవో సాయికుమార్, ఇతర పంచాయతీరాజ్ అధికారులు, సర్పంచ్, వార్డు సభ్యులు స్థానిక నేతలు పలువురు మండల పరిషత్ కార్యాలయం నుంచి ఫ్లెక్సీలు, ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేస్తూ ర్యాలీచేపట్టారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఇంటా మరుగుదొడ్డి నిర్మించి, వినియోగించాలని, మన మరుగుదొడ్డి - మనగౌరవం, బహిరంగ మల, మూత్రవిసర్జన చేయరాదని, మురుగు కాల్వల్లో చెత్తవే యరాదని తదితర నినాదాలుచేస్తూ ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ర్యాలీలో సర్పంచ్ కుషీబాయి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీ ఆర్డీ జవహర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ వేణుగోపాలస్వామి, యేమినేని కోటేశ్వరరావు, ఎంపీటీసీసభ్యులు, చిలువూరు సర్పంచ్‌చిలువూరు మాణిక్యం, కేఆర్‌కొండూరు సర్పంచ్ కొందూరు రూన్సీ పంచాయతీ కార్యదర్శి వివేకానంద, టీడీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.


వేములూరిపాడులో విద్యార్థుల ర్యాలీ

ఫిరంగిపురం(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేములూరిపాడు గ్రామంలో టీడీపీ నేతలు, ఉపాధ్యాయులు, గ్రామ కార్యదర్శి లక్ష్మి, స్వచ్ఛ భారత్ మండల కో-ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కటికల రామకోటేశ్వరరావు, పలువురు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు, (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి పాతమల్లాయపాలెం సెంటర్ వరకు అధికారులు అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎంపీడీవో శివపార్వతి, ఈవోపీఆర్డి రవి కుమార్, దబ్బూరి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఖాజా పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రంథాలయ వారోత్సవాలు

● పాల్గొన్న అధికారులు, ఉపాధ్యాయులు
● విద్యార్థులకు వివిధ విభాగాల్లో పోటీల నిర్వహణ
● ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా నివాళులు

దుగ్గిరాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆరోరోజు మంగళవారం విద్యార్థినులకు చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి బీ.జ్యోతి, జడ్పీ బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు రాజేశ్వరి, దేవకుమార్‌లు పోటీలను పర్యవేక్షించారు. 20వ తేది డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన కార్యక్రమంతో ఈ వారోత్సవాలు ముగుస్తాయన్నారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బుధవారం బహుమతి ప్రదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

తుళ్లూరు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం తుళ్లూరులో గ్రంథాలయ అధికారి టీ.గిరిధర్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు, మెహందీ పోటీలు నిర్వహించారు. ఇందరా అలాగే గాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రత్న సుబ్బమ్మ, పంచాయతీ సెక్రటరి వి.వి రమణ, మేరిమాత పాఠశాల, మార్గదర్శి , కేవీఆర్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


తుళ్లూరులో మెహందీ పోటీలలో పాల్గొన్న విద్యార్థినులు


నూతక్కి గ్రంథాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

తాడేపల్లిటౌన్, (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి శాఖా గ్రంథాలయంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సుబ్బాయమ్మ, సాయి వైష్ణవి, స్వర్ణలత విచ్చేశారు. స్థానిక ప్రాథమిక, ఉన్నత పాఠశాల, శ్రీభగవాన్, రవీంద్రభారతి పాఠశాలల నుంచి దాదాపు 80 మంది విద్యార్థులు పాల్గొన్నారని గ్రంథాలయ అధికారి షేక్ నాగూర్‌బాషా తెలిపారు.

మంగళగిరి సిటీ, (ఆంధ్రజ్యోతి): విజ్ఞానాన్ని పంచే గ్రంథాలయాలను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వీ.సుబ్బరత్నమ్మ కోరారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళగిరి శాఖా గ్రంథాలయంలో భారత తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఇందిరా గాంధీ సేవలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.ఆరోగ్యం, విశ్రాంత ఉపాధ్యాయిని వై.నాగకుమారి, రికార్డ్ అసిస్టెంట్ పీ.కృష్ణ, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మంగళగిరి శాఖా గ్రంథాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

నూతక్కి గ్రంథాలయంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. పాఠశాల విద్యార్థులచే గ్రంథాలయ ప్రతిజ్ఞ చేయించారు కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.నరసింహారావు, గ్రామ పెద్దలు జొన్నల శివరామిరెడ్డి, జొన్నల బ్రహ్మానందరెడ్డి, సాంబిరెడ్డి, సోషల్ టీచర్ డి.సుజాత, కే.అజయ్, ఎస్‌కే సమీర్, జె.అక్షయ, పీ.రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు,(ఆంధ్రజ్యోతి): 57 గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ప్రత్తిపాడు శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సీనియర్స్, జూనియర్స్ విభాగాలలో నిర్వహించిన పోటీలలో 44 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. సీనియర్స్ విభాగంలో మొదటి నాలుగు స్థానాలు అఖిల, భావన, హసిని, జే వెంకట నందినిలు నిలవగా, సీనియర్స్ విభాగంలో యశ్విత, ఆయేషాబాను, తాన్యా జోయల్, ఆఫియా బానులు మొదటి నాలుగు స్థానాలు సాధించినట్లు లైబ్రేరియన్ అరుణ తెలిపారు.

అభయాంజనేయ స్వామికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

చేబ్రోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వడ్లమూడిలోని అభయాంజనేయ స్వామిని మంగళవారం ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైరన్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకుడు తోట రామారావు ఆధ్వర్యంలో అభయ హస్త వీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



తెనాలి అర్బన్: శ్రీ శ్రీనివాస కళ్యాణ మహోత్సవం బుధవారం సాయంత్రం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించనున్నారు. శ్రీవిఖనస శ్రీనివాస ట్రస్ట్ సభ్యులు మంగళవారం కళ్యాణ మహోత్సవ కరపత్రాలను విడుదల చేశారు.



రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

చేబ్రోలు, నవంబరు 19: మండల పరిధిలోని నారాకోడూరు గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం పొన్నూరు పట్టణానికి చెందిన బండారు శ్రీనివాసరావు (42) విజయవాడ నుంచి ఆయిల్ ప్యాకెట్ల లోడ్‌తో పొన్నూరు వస్తుండగా చేబ్రోలు మండలం నారాకోడూరు మధ్య ఎదురుగ వస్తున్న బస్సు ఆటోను ఢీకొంది ప్రమాదంలో ఆటోను నడుపుతున్న శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడి సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ప్రమాదంపై చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

మాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాబురావు నియామకంపై హర్షం

పొన్నూరుటౌన్, నవంబరు19: ఆంధ్రప్రదేశ్ మాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా పొన్నూరుకు చెందిన బండ్లమూడి బాబురావు నియమితులైయ్యారు. మంగళవారం ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో బాబురావు పేరు ప్రకటించటం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం అవుతుంది. బండ్లమూడి బాబురావు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఏఎంసీ వైస్ చైర్మన్‌గా పని చేశారు. పొన్నూరు మండలంలోని అత్యంత సమస్యాత్మక గ్రామమైన మన్నవకు చెందిన బాబురావు టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడిగా గుర్తింపు పొందారు. టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న బాబురావుపై 2019 వైసీపీ ప్రభుత్వ హయాంలో హత్యయత్నం జరిగింది. ప్రత్యర్థుల దాడిలో బాబురావు తీవ్రంగా గాయపడి, కోలుకున్నాక, తిరిగి పార్టీలో చురుకుగా పనిచేశారు. పార్టీపట్ల అంకిత భావంతో పనిచేసే బండ్లమూడి బాబురావుకు మాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా అవకాశం రావటంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

సహస్రలింగేశ్వర స్వామికి లక్ష బిల్వార్చన

చేబ్రోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు సహస్రలింగేశ్వర స్వామికి మంగళవారం లక్షబిల్వార్చన కార్యక్రమం నిర్వహించారు. పవిత్ర కార్తీక మాసం ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామున ఏకాదశి రుద్రాభిషేకాలు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం లక్ష బిల్వార్చన చేసి సహస్రనామ అర్చనలు జరిగాయి. గత 27 ఏళ్లుగా దేవరపల్లి శ్రీనివాసరావు, ఊర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చనలు నిర్వహిస్తున్నారు.

పీఎం స్వనిధిపై అవగాహన సదస్సు

తెనాలి, మారీసుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి స్వనిధిపై అవగాహన సదస్సును పట్టణ పురపాలక సంఘ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు వీధి సంచార వ్యాపారులతో నిర్వహించారు. పట్టణ పురపాలక సంఘ కార్యాలయంలో మంగళవారం మెప్మా ఆధ్వర్యంలో వీధి సంచార వ్యాపారులకు ప్రధానమంత్రి స్వనిధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పురపాలక సంఘ అసిస్టెంట్ కమీషనర్ లక్ష్మీపతిరావు పాల్గొని పీఎం స్వ నిధి లబ్దిదారులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైద్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మల, సిటీ మిషన్ మేనేజర్ జి విజయకుమారి, పలు బ్యాంకు మేనేజర్లు, వీధి సంచార వ్యాపారులు పాల్గొన్నారు.

ఖాతాదారుల సంక్షేమానికి సహకార సంఘాల కృషి: రామారావు

తెనాలి అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారుల సంక్షేమానికి సహకార సంఘాలు కృషి చేస్తున్నాయని డివిజన్ కో-ఆపరేటివ్ అధికారి కేవీ రామారావు చెప్పారు. కొత్తపేటలోని పోస్టల్, టెలికాం కో-ఆపరేటివ్ సొసైటీ సహకార వారోత్సవాలను మంగళవారం ప్రారంభించారు. సహకార పతాకాన్ని ఎగుర వేసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉద్యోగుల సంక్షేమానికి అవసరమైన రుణాలు అందిస్తూ సొసైటీ ప్రగతి పథంలో ఉండేందుకు కార్యవర్గం కృషి చేస్తుందని అభినందించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయలక్ష్మి, అధ్యక్షులు రవికుమార్, కోశాధికారి పోతురాజు, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, సీఈవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని మెరుగుపర్చండి: మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని పట్టణ పురపాలక సంఘ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మున్సిపల్ అధికారులను ఆదేశించారు. స్థానిక ముత్తెంశెట్టిపాలెం 15వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులతో కలిసి పర్యవేక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరావు, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, అసిస్టెంట్ ఇంజనీర్ సూరిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొలకలూరులో కలుషిత తాగునీరు

- గతంలో డయేరియా లక్షణాలతో బాలిక మృతి
- దాదాపుగా 100మందికి వైద్యశిబిరంలో చికిత్స
- మురుగు కాలువలోనే నీటి గొట్టాలు
- లీకులతో మురుగునీరు పైపుల్లో చేరి సమస్య
- అనారోగ్య సమస్యల భయంతో కాలనీవాసులు
- జల్ జీవన్‌మిషన్‌లో అవినీతిపై ఆరోపణలు


మురుగు కాలువలో లీకవుతున్న పైప్‌లైన్ వాల్, మురుగు కాలువలో ఉన్న పైప్‌లైన్లు, నీటికనెక్షన్ల వద్ద లీకవుతున్న నీరు


కుళాయిల్లో వచ్చిన నీటిలో అడుగున చేరిన మురుగు

తెనాలి రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మురుగు కాలువల్లో తాగునీటిపైపులైన్లు ఏర్పాటు చేయడంతో ఆ నీరు కలుషితమై రంగుమారి దుర్వాసన వస్తూ ప్రజల ఆరోగ్యానికి హానికరంగా మారాయి. మండలంలోని కొలకలూరులో తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన పైపులైన్లు మురుగు కాలువలో ఉండటంతో వాటికి లీకులు ఏర్పడి కాలువలో నీరు పైపుల్లో చేరుతున్నాయి. గతంలో 2022 వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో పేదల కాలనీలో డయేరియా లక్షణాలతో ఓ బాలిక మృతి చెందగా అదే కాలనీలో వందల మంది మంచంపట్టారు. దీంతో అప్పటి జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి ప్రత్యేక చొరవచూపి గ్రామంలో యుద్ధప్రాతిపదికన హెల్త్ క్యాంపులు ఏర్పాటుచేసి తక్షణ చర్యలు చేపట్టారు. ఆ సమయంలో అక్కడ ప్రజలు మురుగు కాలువలో ఉన్న పైపులైన్ల దుస్థితిని కలెక్టర్‌కు వివరించారు. నిత్యం తమ ప్రాణాలతో కలుషిత నీరు చెలగాటమాడుతున్నాయని వాపోయారు. దీనిపై కలెక్టర్ స్పందించి మురుగు కాలువలో పైపుల ద్వారా నీటి సరఫరా నిలుపుదల చేయించి రోడ్డు మధ్య ప్రత్యేక లైన్ ఏర్పాటు చేసి సురక్షితనీరు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ కార్యరూపం దాల్చకపోవడంతో గ్రామస్థులు మినరల్ వాటర్‌పై ఆధారపడక తప్పలేదు. ప్రతి రోజు దాదాపుగా ఒక్కో కుటుంబానికి మినరల్ వాటర్ కొనుగోలుకు రూ.60వరకూ పేదల కుటుంబాలపై భారం పడుతోంది. ఆ భారం భరించలేని కొందరు బోర్‌పంపుల నుంచి వచ్చే నీటిని తాగుతున్నారు. జల్ జీవన్ మిషన్ కింద గత సంత్సరం ఆ గ్రామంలో తాగునీరు ప్రతి ఇంటికి అందించేలా రూ.1కోటి 40లక్షలతో పనులు ప్రారంభించారు. అయితే అదికూడా ఆశించినంత ఫలితాన్ని ఇవ్వలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రోడ్డుకు సగభాగంలో పైప్‌లైన్ల కోసం పగులగొట్టి వదిలేశారన్న విమర్శలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం కాలువ వద్దనే పైపులు వేసి 200 కనెక్షన్లకు గాను దాదాపుగా 100 కుళాయిలు బిగించారు. వీటికి నీటి సరఫరా అయ్యేందుకు సుమారుగా 40,000 లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంక్‌ను నిర్మించారు. కాగా దీని ద్వారా ప్రతిరోజు గ్రామంలో ఉదయం గంటపాటు, సాయంత్రం మరో గంట నీటి సరఫరా జరుగుతోందని కాలనీ వాసులు చెబుతున్నారు. మిగిలిన సమయంలో ఆ పైపులైన్లకు లీకులు ఉండటంతో తాగునీరు నిలిపివేసిన సమయంలో మురుగుపైపుల్లో చేరి రంగుమారిన నీరే తమ కాలనీలో సుమారు 50 కుళాయిలకు వస్తున్నాయని మిగిలిన వారికి చుక్కనీరు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. నిబంధనల ప్రకారం ఒక్కో ట్యాప్ ద్వారా నిముషానికి 5లీటర్ల నీరు రావాల్సి ఉండగా 5నిముషాలకు ఒక్కలీటరు మాత్రమే వస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. అవి కూడా మట్టిగా నలుపురంగులో వస్తున్నాయని, సమయం ముగియడంతో పైపుల ద్వారా నీటి సరఫరా నిలిచిపోయి నీటికోసం ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. 40వేల లీటర్ల సామర్థ్యం ఉన్న మరో పాత వాటర్ ట్యాంకు ద్వారా సుమారు 600 కనెక్షన్లు ఉండగా కేవలం 100 కనెక్షన్లకు మాత్రమే గంటపాటు నీరు రావడంతో నీటికోసం ఇక్కట్లు పడుతున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఉదయం ఆటోల సాయంతో డ్రమ్ములతో సమీపంలోని జగనన్న కాలనీకి వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నట్లు పలువురు తెలిపారు. ప్రభుత్వం మారినా తమకు తాగునీటి కష్టాలు తీరడంలేదని, అధికారులు లీకుల సమస్య పరిష్కరించి, ప్రతి ఇంటికి సురక్షిత నీరు అందించి తమ కష్టాలు తీర్చాలని పలువురు కోరుతున్నారు.

జల్‌జీవన్ మిషన్ పేరుతో దోచేశారు: సుద్దపల్లి రవి



గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పేరుతో గత సంవత్సరం రూ.కోటి 40లక్షలతో తాగునీరు అందించేలా పైపులైన్ల పనులు చేపట్టారని కాలనీ పెద్ద సుద్దపల్లి రవి తెలిపారు. ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు ఏర్పడిన జల్‌జీవన్ పథకం తమకు మాత్రం నిరుపయోగంగా మారిందని ఆరోపించారు. దీనిద్వారా ఇంటింటికి కుళాయి కనెక్షన్ పేరుతో దళారులు ఒక్కో ఇంటికి రూ.500 నుంచి రూ.2000 వరకూ వసూలు చేశారని, తీరా కనెక్షన్ ఇచ్చినప్పటికీ తాగునీరు మాత్రం రావడంలేదని దీనిపై పూర్తిస్థాయిలో విచారణజరిపి అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు చేపట్టి తమకు తాగునీరు అందేలా చూడాలని కోరుతున్నారు.


డాక్టర్ వెంకటేశ్వరరావుకు బంగారు పతకాన్ని అందజేసిన ఐఎంఏ తెనాలి శాఖ అధ్యక్షుడు అనిల్ కుమార్, మధు ప్రభాకర్‌బాబు, తదితరులు

డాక్టర్ వెంకటేశ్వరరావుకు బంగారు పతకం

తెనాలి, మారీసుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అత్యుత్తమ వైద్యసేవలకుగాను గుంటూరు పట్టణానికి చెందిన గైనకాలజిస్ట్ డాక్టర్ వెంకటేశ్వరరావుకు బంగారు పతకాన్ని ఐఎంఏ సభ్యులు మంగళవారం అందజేశారు. స్థానిక బోసురోడ్డులోని ఐఎంఏ తెనాలి శాఖ కార్యాలయంలోని ఐఎంఏ హాల్‌లో డాక్టర్ కొత్త పరిణామలక్ష్మి స్మారక ఎండోమెంటు గోల్డు మెడల్‌ను గుంటూరుకు చెందిన డాక్టర్ బి వెంకటేశ్వరావుకు తెనాలి శాఖ అధ్యక్షుడు డాక్టర్ అనిల్ కుమార్, కార్యదర్శి డాక్టర్ జి మధు ప్రభాకర్‌బాబులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వరావు మాట్లాడుతూ డాక్టర్ పరిణామలక్ష్మి పేరున అందిస్తున్న గోల్డ్ మెడల్‌ను అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. డెలివరీలు, సిజేరియన్ ఆపరేషన్‌లలో వచ్చిన నూతన విధానాలు, చికిత్సల గురించి వైద్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు శ్యామ్‌ప్రసాద్, చందు ఉదయ్‌భాస్కర్, పాటిబండ్ల దక్షిణామూర్తి, చందు సాంబశివుడు, శేషగిరిరావు, జి.నరసింహారావు, డాక్టర్ కొత్త పరిణామలక్ష్మి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానానికి అందించిన కంప్యూటర్ లతో అధికారులు

పెదకాకాని శివాలయానికి కెనరా బ్యాంక్ కంప్యూటర్ల వితరణ

పెదకాకాని, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని కెనరా బ్యాంక్ శాఖ మల్లేశ్వర స్వామి దేవస్థానానికి రూ.1,80,000/-లు విలువ కలిగిన పీఓఎస్ కంప్యూటర్లు మంగళవారం వితరణగా అందిచినట్లు ఆలయ ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ ఏజీఎం యు.రామమోహన్, పెదకాకాని కెనరా బ్యాంక్ మేనేజర్ మన్నెం సీతారామయ్య, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.


దశావతారుని సన్నిధిలో జరుగుతున్న ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

దశావతారుని సన్నిధిలో ప్రత్యేక పూజలు

పెదకాకాని, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న దశావతార వేంకటేశ్వరస్వామి వారి దివ్య క్షేత్రంలో ప్రత్యేక పూజలు మంగళవారం జరిగాయి. ఆలయంలోని శ్రీమహాగణపతిస్వామి వారికి సంకటహర చతుర్థి వ్రతాలు ఘనంగా జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ బాస్కర్ రావు దంపతులు, ఆలయం అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

సిబార్ డెంటల్ కళాశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

పెదకాకాని, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కళాశాల జీవితం మనకు ఎన్నో మంచి అనుభవాలను నేర్పుతుందని ఢిల్లీ ఎయిమ్స్ డెంటల్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ చీఫ్ డాక్టర్ రీతు దుగ్గల్ తెలిపారు. మంగళవారం సిబార్ దంత వైద్య కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు కళాశాల డీన్ డాక్టర్ ఎల్ కృష్ణ ప్రసాద్ అధ్యక్షత వహించారు. స్నాతకోత్సవంలో 95 మంది బీడీఎస్ విద్యార్థిని, విద్యార్థులకు పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో భారత దంత వైద్య మండలి సభ్యురాలు డాక్టర్ పి.రేవతి, డాక్టర్ సీహెచ్ సందీప్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ టి.కృష్ణమోహన్, డాక్టర్ బీవీ రమణారెడ్డి, డాక్టర్ ఎం.ప్రకాష్, డాక్టర్ బీ.నగేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి: కమిషనర్

తెనాలి, మారీసుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఆధార్ కేంద్రం సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ప్రజలను కోరారు. స్థానిక సుల్తానాబాదులో మంగళవారం సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఏర్పాటుచేసిన ఆధార్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ నెల 22వ తేదీ వరకు ఈ క్యాంపు అందుబాటులో ఉంటుందని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం హైస్కూల్స్‌లో ఆధార్ సెంటర్లు: ఎంపీడీవో

కొల్లిపర, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సౌకర్యార్థం మండల పరిధిలోని కొల్లిపర, తూములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఆధార్ సెంటర్స్‌ను ప్రారంభించినట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం మండల కేంద్రం కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను ఆమె తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ సెంటర్స్ ద్వారా ఆధార్‌లో ఏ విధమైన తప్పులు ఉన్నా, అడ్రస్సు మారిన సరి చేయించుకోవాలన్నారు. విద్యార్థులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో హైస్కూల్స్‌లో ఆధార్ సెంటర్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ భార్గవ్, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

25న ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా ప్రదర్శన


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ జియావుల్ హక్

పొన్నూరు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25వ తేదీన కృష్ణ, గుంటూరు జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఓటర్ల జాబితాను ప్రదర్శించనునట్లు తహసీల్దార్ మహ్మద్ జియావుల్ హక్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఆన్‌లైన్ ద్వారా 2592, ఆఫ్‌లైన్ ద్వారా 1130 దరఖాస్తులు అందయాయన్నారు. ఇప్పటి వరకు 2677 దరఖాస్తులను పరిశీలించి అర్హులుగా గుర్తించినట్లుగా చెప్పారు. పలు కారణాలతో ఆన్‌లైన్‌లో వచ్చిన 433, ఆఫ్‌లైన్‌లో వచ్చిన రెండు దరఖాస్తులను తిరస్కరించినట్లు వివరించారు. 616 దరఖాస్తులు విచారణలో ఉంచామన్నారు. ఈ నెల 25వ తేదీ లోగా తుది జాబితాను ప్రదర్శించనునట్లు చెప్పారు. ప్రతి 800 ఓటర్లకు ఒక పోలింగ్ బూత్ చొప్పున ఏర్పాటు చేయనునట్లు చెప్పారు. పెరిగిన ఓటర్ల జాబితా ప్రకారం మరో రెండు పోలింగ్ బూత్‌లు అవసరం కానునట్లు గుర్తించామని తెలిపారు. ఈ సమావేశంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మహిళా మండలి భవనంను పరిశీలించిన అధికార బృందం

తెనాలి అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేటలోని మహిళా మండలి భవనాన్ని అధికారుల బృందం మంగళవారం పరిశీలించారు. ఈ భవనాన్ని ప్రభుత్వానికి ఇటీవల మంత్రి నాదెండ్ల మనోహర్ సమక్షంలో కమిటీ సభ్యులు అప్పగించారు. ఈ నేపథ్యంలో ఈ భవనం స్కిల్ డెవలప్‌మెంట్ కోసం వినియోగించుకునేందుకు గాను మున్సిపల్ కమిషనర్ శేషన్న, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి సంజీవరావు పరిశీలించి చర్చించారు.

గ్రంథాలయాల్లో మహిళా దినోత్సవం

తెనాలి రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శాఖ గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో వివిధ పోటీలు నిర్వహించారు. కొలకలూరు శాఖ గ్రంథాలయంలో ఆ శాఖ అధికారి కడియాల సుజాత పర్యవేక్షణలో విద్యార్థులు మదర్ థెరిస్సా, సరోజనినాయుడు, అల్లూరి సీతారామరాజు, సావిత్రీబాయ్ పూలే, సరస్వతిదేవి, భరత మాత వంటి పలువురి వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో శ్రీ వర్ధని స్కూల్, జెడ్‌పీహెచ్‌ఎస్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని పెదరావూరు శాఖ గ్రంథాలయంలో ఆ శాఖ అధికారి ఏ. రాఘవేంద్రరావు పర్యవేక్షణలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్ విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు సామ్రాజ్యం మధుమయిలు పర్యవేక్షించారు. సంగంజాగర్లమూడి శాఖాగ్రంథాలయంలో ఆ శాఖ అధికారి జె. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు.

● తెనాలి అర్బన్: బాలికల్లో సృజనాత్మక శక్తిని ముగ్గుల పోటీలు పెంచుతాయని మున్సిపల్ కమిషనర్ శేషన్న చెప్పారు. గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని కొత్తపేట మహిళా బాలల గ్రంథాలయంలో బాలికలు వేసిన ముగ్గులను పరిశీలించారు. తహసీల్దార్ గోపాలకృష్ణ, లైబ్రేరియన్ అంజని, కె. రమాదేవి పర్యవేక్షించారు.

బాలోత్సవ్‌లో మున్సిపల్ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

తెనాలి అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నంబూరు వీవీఐటీ కళాశాలలో ఈ నెల 15 నుంచి 17 వరకు నిర్వహించిన బాలోత్సవ్‌లో తెనాలి ఐతానగర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ సంబరాల్లో పాల్గొన్న 36 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు లభించాయి. మంగళవారం విద్యార్థులను అభినందించారు.

'పీఎం సూర్యఘర్'ను సద్వినియోగం చేసుకోండి

● ట్రాన్స్ కో ఈఈ వీవీ చిరంజీవి





తెనాలి అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు పీఎం సూర్యఘర్ పథకం ప్రవేశ పెట్టిందని ట్రాన్స్ కో ఈఈ వివి.చిరంజీవి ఆంధ్రజ్యోతికి మంగళవారం చెప్పారు. ఈ పథకం వివరాలు...

ప్రశ్న: పీఎం సూర్యఘర్ అమలుకు ఏం చేస్తున్నారు?

జవాబు: డివిజన్ పరిధిలో పథకం వినియోగించుకునేలా విస్తృత ప్రచారం చేస్తున్నాం. ఇప్పటివరకు 750మంది దరఖాస్తు చేసుకోగా, 150మందికి మీటర్లు బిగించాం. ఈ 50 మందికి సబ్సిడీ కూడా వచ్చింది.

ప్రశ్న: సబ్సిడీ ఎంత ఇస్తారు?

జవాబు: సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 3కేవీకి రూ.78 వేలు సబ్సిడీ ఇస్తారు. రూ.2 లక్షల వరకు వ్యయం అవుతుంది.

ప్రశ్న: పీఎం సూర్యఘర్ దరఖాస్తు విధానం ఎలా?

జవాబు: ఆన్‌లైన్‌లో ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలి. అందులోనే సోలార్ ప్యానల్స్ బిగించే వారి వివరాలు అన్నీ అందుబాటులో ఉంటాయి. ఇళ్లకు మాత్రమే ఈ పథకం మంజూరు అవుతుంది.

ప్రశ్న: స్మార్ట్ మీటర్ల విధానం అమలు చేస్తున్నారా?

జవాబు: గత ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల విధానాన్ని పూర్తిగా అమలులోకి తెచ్చింది. ఆ విధానంలో ప్రస్తుతం స్కూల్స్ ఆఫీసులకు ఉన్న మీటర్లు మార్చాం. డివిజన్ పరిధిలో 4500 సర్వీసులు ఉండగా మూడు వేలకు పైగా స్మార్ట్ మీటర్లు బిగించాం. సెకండ్‌ఫేజ్‌లో ఇళ్లకు స్మార్ట్ మీటర్లు వస్తాయి.



నిర్లక్ష్యం నీడలో పోలీసు స్థలం

తెనాలి పట్టణం నడిబొడ్డున కొత్తపేటలో రూ.25 కోట్లకు పైగా విలువ చేసే పాత పోలీసు క్వార్టర్స్‌కు చెందిన స్థలాన్ని పోలీసు అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో ఈ ప్రాంతం చిట్టడవిగా మారింది. ఈ స్థలంలోని అడ్డంకులు తొలగిస్తే పోలీసులు వివిధ కార్యకలాపాలకు వినియోగించుకునే అవకాశం ఉంది. ఈ దిశగా పోలీస్ హౌసింగ్ బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. - **తెనాలి క్రైం, ఆంధ్రజ్యోతి**

భక్తి శ్రద్ధలతో సంకట హర చతుర్థి


ప్రత్యేక పూజలందుకున్న వర సిద్ధి వినాయక స్వామి

పొన్నూరు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో జీబీసీ రోడ్డులోని సిద్ధి బుద్ధి సమేత వర సిద్ధి వినాయకస్వామి ఆలయంలో మంగళవారం సంకటహర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. పట్టణంలోని సహస్రలింగేశ్వర స్వామి, వీరాంజనేయ స్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన యంత్రస్థానం వద్ద 108 కలశాలను మంత్ర జలాలతో నింపి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆ 108 కలశాలను ఊరేగించి పట్టణ శివారులోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయం వరకు మేళతాళాలతో తీసుకొని వెళ్లారు. ఆలయంలో మూలవిరాట్‌కు 108 కలశాలతో అభిషేకాలు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సంకటహర చతుర్థి వేడుకలో పొన్నూరు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బహిరంగ మల, మూత్ర విసర్జన చేస్తే జరిమానా

పొన్నూరు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణాన్ని బహిరంగ మల మూత్ర విసర్జన రహిత పట్టణంలో తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు మంగళవారం కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పురపాలక సంఘంలో పారిశుధ్య పనులను చేపడుతున్నట్లు చెప్పారు. పొన్నూరు పట్టణంలోని పాఠశాలలు, పొదుపు మహిళల, వార్డు ప్రజల విజ్ఞప్తి మేరకు బహిరంగ మలమూత్ర విసర్జన రహితంగా పట్టణాన్ని తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే రూ.500 జరిమానా, పది రోజుల జైలు శిక్ష విధించనునట్లు చెప్పారు. దీనిపై సలహాలు, అభ్యంతరాలు ఉంటే 15 రోజులో పురపాలక సంఘ కార్యాలయంలో తెలియజేయాల్సిందిగా కమిషనర్ రమేష్ బాబు కోరారు.

అపరాల సాగులో జాగ్రత్తలు పాటించాలి

● సహాయ వ్యవసాయ సంచాలకులు సునీత

పొన్నూరు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రబీ పంటల సాగులో అపరాలు పండించే రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు ఐ.సునీత అన్నారు. మండల పరిధిలోని ములుకుదురు, మాచవరం గ్రామాలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంట పోలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. జిల్లా వనరుల కేంద్రం నుంచి విచ్చేసిన ఏడీఏ సునీత మాట్లాడుతూ ప్రస్తుతం వరి పైరు కోతకు సిద్ధంగా ఉందన్నారు. ధాన్యం కొనుగోలులో కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఈ కేంద్రాలలో ధాన్యం విక్రయించే రైతులు తేమ శాతం తగ్గించాలని సూచించారు. స్థానిక ఏడీఏ వి.రామకోటేశ్వరి మాట్లాడుతూ రైతులు దాళ్వా సాగులో పంటల బీమా పథకంలో చేరాలని సూచించారు. పశు సంవర్ధక శాఖ డాక్టర్ ఎ.శైలజ మాట్లాడుతూ పెయ్య దూడలు పుట్టడానికి అవసరమైన వీర్యం అందుబాటులో ఉందని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. పశు సంవర్ధక శాఖ పశు గణన చేపట్టనునట్లు చెప్పారు. వ్యవసాయశాఖ అధికారులు మాట్లాడుతూ ఖరీఫ్‌లో పండిన బీపీటీ 5204, ఇతర సన్నరకం ధాన్యం గ్రేడ్ ఎ కింద 75 కిలోల బస్తా రూ.1740, బీ గ్రేడ్ రకం రూ.1725కు అమ్ముకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏవో దేగల వెంకట రామయ్య, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ మరుగుదొడ్డి ఉండాలి: ఎంపీడీవో

కొల్లిపర, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, సిరిపురం, అత్తోట తదితర గ్రామాల్లో ప్రపంచ మరుగుదొడ్డి దినోత్సవం సందర్భంగా అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని గ్రామపురవీధుల్లో నిర్వహిస్తూ మరుగుదొడ్డి విశిష్టత గురించి వివరించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ బహిరంగ మలవిసర్జన చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బహిరంగా మలవిసర్జన చేస్తే వారిపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ భార్గవ్, మండల కో-ఆర్డినేటర్ మర్రెడ్డి వెంకటరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.